
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
www.andhrajyothy.com
కామారెడ్డి
మంగళవారం 29 ఆగస్టు 2017



20

## పకడ్బందీగా గొర్రెల పంపిణీ




- అక్రమాలకు తావులేకుండా విజిలెన్స్‌తోపాటు రెండు బృందాలను ఏర్పాటు చేశాం
- రాష్ట్రంలో గొర్రెల పంపిణీలో జిల్లాకు 9వ స్థానం
- ఇప్పటివరకు 2,828 యూనిట్లకు గొర్రెలను పంపిణీ చేశాం
- అంటువ్యాధులు రాకుండా టీకాలు వేయిస్తున్నాం
- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రమేశ్

2

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

# రెవెన్యూ లెక్కలు.. పక్కా!

జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్‌లలో జరిగే అక్రమాలకు ఇక కళ్లెం పడనుంది. ఇక మీదట భూముల వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే నమోదు కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం భూ సర్వేకు శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ భూముల లెక్కలు తేలనున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లోకి వెళ్లి భూ సర్వేలో పాల్గొనాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. దీంతో ప్రతీ రెవెన్యూ గ్రామాన్నీ ఒక యూనిట్‌గా పరిగణలోకి తీసుకొని ప్రణాళికా బద్ధంగా భూ సర్వే చేయనున్నారు. భూ రికార్డులను ప్రక్షాళన చేసే పనిలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది.




8

### ఇక భూ వివాదాలకు చెక్..

- భూముల సర్వేకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం
- భూ రికార్డుల ప్రక్షాళనకు కసరత్తు ప్రారంభం
- తేలనున్న ప్రభుత్వ, ప్రైవేట్ భూముల లెక్కలు
- రెవెన్యూ గ్రామ యూనిట్‌గా సర్వేలు
- ఇక వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు
- సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు కొనసాగనున్న భూ సర్వే



## మంత్రివర్యా.. ఇంకెన్నాళ్లు?



- కామారెడ్డి మండలంలో 17 గ్రామ పంచాయతీలకు నలుగురే కార్యదర్శులు
- ఒక్కో కార్యదర్శికి 6గ్రామాల ఇన్‌చార్జీ బాధ్యతలు
- ఉన్న సిబ్బందిపై పెరుగుతున్న పనిభారం
- కార్యదర్శులు లేక కుంటుపడుతున్న గ్రామాల అభివృద్ధి
- సమస్యలతో సతమతవుతున్న ప్రజలు
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి అయినా స్పందించేనా?
- నేడు జిల్లాకు మంత్రి జూపల్లి కృష్ణారావు రాక

20



## ఆన్‌లైన్ పరేషాన్!



- ఇక ఆన్‌లైన్‌లోనే బీడీ కార్మికుల పిల్లల ఉపకార వేతనాల నమోదు
- పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందే..
- మారిన దరఖాస్తు విధానం.. కరువైన ప్రచారం
- కొత్త విధానంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

.. వివరాలు 11లో

# పకడ్బందీగా గొర్రెల పంపిణీ

❖ 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్

ఇంటర్వ్యూ

**జిల్లాలో గొర్రెల పంపిణీ పకడ్బందీగా సాగుతోంది. గొర్రెల పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా కొనసాగిస్తున్నామని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రమేశ్ తెలిపారు. గొర్రెలు రీ సైక్లింగ్ కాకుండా పంపిణీ చేసిన లబ్ధిదారుల వద్ద ఉన్న గొర్రెల యూనిట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా విజిలెన్స్ కమిటీలతో పాటు రెండు బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటివరకు జిల్లాలో 2828 గొర్రెల యూనిట్లను పంపిణీ చేశాం. రాష్ట్రంలో గొర్రెల పంపిణీలో కామారెడ్డి 9వ స్థానంలో ఉందని సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.**



(ఆంధ్రజ్యోతి-కామారెడ్డి)

**ఆంధ్రజ్యోతి:** జిల్లాలో గొర్రెల పంపిణీలో అక్రమాలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**అధికారి:** గొర్రెల పంపిణీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. కోట్లాది నిధులు ఈ పథకానికి ఖర్చు చేస్తోంది. ఆ నిధులు దుర్వినియోగం కాకుండా గొర్రెల పంపిణీలో అక్రమాలు జరగకుండా కామారెడ్డి జిల్లాలో ప్రత్యేక విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేశాం. విజిలెన్స్ కమిటీలతో పాటు రెండు ప్రత్యేక టీంలను నియమించాం. వీరు ఎప్పటికప్పుడు పంపిణీ చేసిన గొర్రెల యూనిట్లను పర్యవేక్షిస్తూ నిఘా పెడుతుంటారు. జిల్లాలో గొర్రెల రీ సైక్లిన్ లేదు.

**ఆంధ్రజ్యోతి:** జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు?

**అధికారి:** ఈ సంవత్సరం జిల్లాలో గొర్రెల పంపిణీ లక్ష్యం 8,640 కాగా ఇప్పటివరకు 2,828 గొర్రెల యూనిట్లను పంపిణీ చేయడం జరిగింది. 59,388 గొర్రెలను లబ్ధిదారులకు అందజేశాం. ప్రతీ రోజు 80 యూనిట్ల చొప్పున లబ్ధిదారులకు గొర్రెలను అందిస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** గొర్రెలను ఏ రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నారు?

**అధికారి:** కామారెడ్డి జిల్లాకు గొర్రెల కొనుగోళ్లకై రాష్ట్ర ప్రభుత్వం మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలను కేటాయించింది. కర్నాటకలోని బీదర్, గుల్బార్గా జిల్లాలు, మహారాష్ట్రలోని నాందేడ్, పర్భానీ జిల్లాల నుంచి గొర్రెలను కొనుగోలు చేసి జిల్లాలోని లబ్ధిదారులకు అందజేస్తున్నాం. ఇప్పటివరకు నాందేడ్ జిల్లాలో 1066 గొర్రెల యూనిట్లను, పర్బనీ జిల్లాలో 257, బీదర్‌లో 1022, గుల్బార్గాలో 483 గొర్రెల యూనిట్లను కొనుగోలు చేయడం జరిగింది. ఈ రాష్ట్రాల్లో గొర్రెల కొరత లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్న బడ్జెట్ ఆధారంగా కొనుగోలు చేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** గొర్రెల పంపిణీ పథకాన్ని జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం ఎంత బడ్జెట్ కేటాయించింది?

**అధికారి:** కామారెడ్డి జిల్లాలో గొర్రెల పంపిణీ పథకానికి లక్ష్యం ఈ సంవత్సరం 8640 యూనిట్లు. ఈ యూనిట్లకు గాను ప్రభుత్వం రూ.108 కోట్లు కేటాయించింది. మొదటి విడత కింద రూ.31.309 కోట్లు నిధులను విడుదల చేయగా దానికి తగ్గట్టు 2,828 గొర్రెల యూనిట్లను కొనుగోలు చేసి పంపిణీ చేశాం.

**ఆంధ్రజ్యోతి:** జిల్లాలో మండలాల వారిగా ఎన్ని గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు.?

**అధికారి:** కామారెడ్డి జిల్లాలో మద్నూర్ మండలంలో 447 యూనిట్లు, రామారెడ్డిలో 375 యూనిట్లు, భిక్కనూరులో 350 యూనిట్లు, బాన్సువాడలో 380 యూనిట్లు, లింగంపేట్‌లో 201 యూనిట్లు, మాచారెడ్డిలో 272 యూనిట్లు, జుక్కల్‌లో 274 యూనిట్లు, నస్రుల్లాబాద్‌లో 276 యూనిట్లు, పిట్లంలో 51 యూనిట్లు, బీబీపేట్‌లో 120 యూనిట్లు, బీర్కుర్‌లో 39 గొర్రెల యూనిట్లను పంపిణీ చేయడం జరిగింది. ఇందులో రామారెడ్డి, భిక్కనూరు మండలాల్లో లక్ష్యం పూర్తయింది.

**ఆంధ్రజ్యోతి:** గొర్రెలకు వ్యాధులు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**అధికారి:** గొర్రెలకు అంటు వ్యాధులు ప్రబలకుండా శాఖపరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. గొర్రెలు ఆరోగ్యంగా ఉండేందుకు గొర్రె కాపరులకు అవగాహన కల్పిస్తున్నాం . గొర్రెలు రోగాల భారీన పడకుండా నట్టల మందును సరపరా చేస్తున్నాం. వీటితో పాటు ఉచితంగా టీకాలను వేయిస్తున్నాం.వానకాలం ఉన్నందున గొర్రెలు త్వరగా రోగాల భారీన పడే అవకాశం ఉంటుంది. దీంతో గొర్రె కాపరులు గొర్రెల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలి.

**ఆంధ్రజ్యోతి:** గొర్రెల కాపరులకు గడ్డి విత్తనాలు సరఫరా చేస్తున్నారా?

**అధికారి:** జిల్లాలో గొర్రెలకై పశుగ్రాసం కొరతా ప్రస్తుతం లేదు. గొర్రెల కాపరులకు గడ్డి విత్తనాలను సరఫరా చేస్తున్నాం. ఇప్పటి వరకు 4 మెట్రిక్‌టన్నుల గడ్డి విత్తనాలను అందించాం. ఇందులో 2 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలను లబ్ధిదారులకు, మెట్రిక్ టన్ను ఉద్యానవనశాఖ, ఒక మెట్రిక్‌టన్నుల గడ్డి విత్తనాలను అటవీశాఖకు పంపిణీ చేశాం.

## భోజనాన్ని ఏ ఆకులో భుజిస్తే మేలు?




**కామారెడ్డి కల్చరల్:** అరటి ఆకులో భోజనం చేయడానికి కారణం అన్నంలో ఒక వేళ విషం కలిసినట్లయితే ఆ ఆకు నలుపు రంగుగా మారిపోతుంది. అదే విధంగా వేడి అన్నం వడ్డిస్తే ఆకులో అనేక రకాల పోషకాలు అరటి ఆకులో ఉన్నందున మంచి రుచిని, పర్యావరణానికి విఘాతం కలుగకుండా మట్టిలో కలిసిపోతుంది. గతంలో ఇంటికి వచ్చిన అతిథుల మనస్సులో ఆనుమానం రాకూడదనే ఉద్దేశ్యంతో ఆకులో భోజనం పెట్టేవారు. అంతేకాకుండా ఆకలి పెరుగుతుందని నమ్ముతారు. అంతేకాక ఆరోగ్య వంతులుగా ఉంటారు. అదే కాకుండా మనం తామరాకులో భోజనం చేయడం వల్ల ఐశ్వర్యం, లక్ష్మీదేవి కటాక్షం కలుగుతుంది. భాదాం ఆకులో భోజనం చేయడం వల్ల కఠిన హృదయులైతారు. టేకు ఆకులో భుజిస్తే భవిష్యత్తు, వర్తమానాలు తెలుసుకోగలిగే జ్ఞానం లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

## ఐకేపీ సిబ్బందికి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కల్పించాలి..

లీడర్ వాయిస్



**కామారెడ్డి కల్చరల్:** కామారెడ్డి జిల్లాలోని ఐకేపీలో పని చేస్తున్న ఆపరేటర్లు, సిబ్బందికి ఉద్యోగ భద్రత లేదు. కనీస వేతనాలు కూడా లేకుండా 16 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న తమకు కనీస వేతనం కల్పించకపోగా ఉద్యోగ భద్రత కూడా లేకపోవడంతోనే రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీలో పని చేస్తున్న తాత్కాలి సిబ్బంది ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. జిల్లా కేంద్రంలో రోజుకో పద్ధతిలో నిరసన కార్యక్రమాలు చేపడుతూ ప్రభుత్వానికి విన్నవిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి తమకు ఉద్యోగ భద్రత కల్పించే వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తాం.

**- తిరుపతిరెడ్డి, ఐకేపీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, కామారెడ్డి**

# మున్సిపల్ నూతన భవనానికి మోక్షమెప్పుడో?

❖ భవనం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని పరిస్థితి ❖ నేడు పంచాయతీ రాజ్ మంత్రి చేత ఎంపీడీవో నూతన భవనం ప్రారంభం

**కామారెడ్డి:** జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన మున్సిపల్ భవనం పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. నూతన భవనం పూర్తి హంగులతో సిద్ధమైనప్పటికీ భవనాన్ని ప్రారంభించడం లేదు. మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించాలని పలు సార్లు నిర్ణయించినప్పటికీ వాయిదా పడుతూ వచ్చింది. చివరకు జిల్లా మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ ప్రారంభిస్తారని ప్రచారం జరిగిన నూతన భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఎంపీడీవో కార్యాలయంలో కోటి రూపాయలతో నిర్మించిన నూతన భవనాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జుపల్లి కృష్ణరావు ప్రారంభోత్సవం చేయనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు నూతన ఎంపీడీవో కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం సమావేశాన్ని నిర్వహించనున్నారు. అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎంపీడీవో కార్యాలయాన్ని వారం రోజుల క్రితమే మంత్రి చేతుల మీదుగా ప్రారంభించాల్సి ఉండగా రెండుసార్లు మంత్రి రాకపోవడంతో వాయిదా పడింది. ఎట్టకేలకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్దన్ ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు.

### ప్రారంభానికి నోచుకొని మున్సిపల్ భవనం

కామారెడ్డి పట్టణంలోని నూతన మున్సిపల్ భవనం పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఎన్నో సంవత్సరాలుగా మున్సిపల్ కార్యాలయం శిథిల భవనంలోనే కొనసాగుతూ వచ్చింది. ఈ కార్యాలయంలోనే ఇంజనీరింగ్, సానిటేషన్, పారిపాలనకు సంబంధించి గదులు ఇరుకురుగుగా ఉండేది. వీటితో పాటు కమిషనర్, చైర్మన్ ఛాంబర్లు సైతం పూర్తిగా శిథిలావస్థలో ఉండేవి అదే విధంగా చాలీ చాలని సమావేశపు హాల్ ఉండేవి. ఈ శిథిలావస్థ భవనం మున్సిపల్ కార్యాలయానికి సరిపోకపోవడంతో 2011లో రూ.1.50 కోట్లతో నూతన భవనం పను లు ప్రారంభించారు. ఈ భవన నిర్మాణం పనులన్ని ఏడాది కిందే పూర్తి అయినప్పటికీ ప్రారంభించడం లేదు. ఇటీవల ప్రస్తుతం కొనసాగుతున్న మున్సిపల్ భవనాన్ని కూల్చివేశారు. కార్యాలయంలోని వివిధ విభాగాలకు సంబంధించి కార్యక్రమాలు పక్కనే మెప్మా కార్యాలయంలో కొనసాగిస్తున్నారు.



నిర్మాణం పూర్తైన కామారెడ్డి మున్సిపల్ నూతన భవనం

# కొందరికి మోదం.. మరికొందరికి ఖేదం!

ఫొటో న్యూస్


అడ్లూర్‌ఎల్లారెడ్డిలో నీటమునిగిన పంట

జిల్లాలో ఇటీవలే కురిసిన వర్షం కొంత మంది రైతులకు మేలును కలిగించగా మరికొందరికి నష్టాన్ని మిగిల్చింది. అడ్లూర్‌ఎల్లారెడ్డి చెరువు కింద లొతట్టు ప్రాంతంలో ఉన్న రైతులకు ఇటీవల వేసిన వరినారు నీట మునిగి పోతున్నాయి. పక్కనే ఎత్తుపై ఉన్న పంట పొలాల్లో వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో వర్షం వచ్చి కొందరి కీడు చేసి మరికొందరికి మేలు చేసిందని రైతులు అంటున్నారు.

**- ఫొటోగ్రాఫర్, కామారెడ్డి**


నిండుగా మారిన పొలాలు

# ప్రజావాణికి 245 వినతులు



ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్

**కామారెడ్డి:** కామారెడ్డి జనహిత భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పలు సమస్యలపై 245 దరఖాస్తులు వచ్చాయి. భూ సమస్యల పై రెవెన్యూ శాఖకు 97, పంచాయతీ రాజ్‌శాఖకు చెందిన సమస్యలపై 22 మంది, విద్య, పింఛన్లు, రుణాలు వంటి సమస్యలపై 22, మున్సిపల్ పరిధిలోని సమస్యల పై 14, ఇతర సమస్యల పై పిర్యాదులు వచ్చాయి. రామారెడ్డి మండలం అన్నారంకు చెందిన 13 మందికి సంబంధించిన 14 ఎకరాల భూమిని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారని తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని, కలెక్టర్‌కు వివరించారు. గతంలోనే ప్రభుత్వం తమకు పట్టాలు ఇచ్చిందని తెలిపారు. అటవీ శాఖ అధికారులు తమ స్థలం చుట్టూ కందకం తవ్వి బౌండ్రి చేశారని వాపోయారు. తాడ్వాయి మండలం సంగోజివాడికి చెందిన రాజేశ్వర్‌రావు, పాసుపుస్తకాల్లో తమ భూమిని వీఆర్వో నమోదు చేయడం లేదని కలెక్టర్‌కు విన్నవించారు. కామారెడ్డి కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డికి చెందిన ధర్మాగోని అనూష, తమ స్థలాన్ని టీఆర్ఎస్‌కు చెందిన నాయకుడు 2015 నుంచి రికార్డులో పేరు మార్చుకున్నారని వెంటనే తమ పేరును రికార్డులో నమోదు చేయించి అదుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఎల్లారెడ్డి మండలం సాతెల్లి ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన అభిషేక్, తమ గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్న వించారు. సదాశివనగర్ మండలం కుప్రియాల్‌కు చెందిన వడ్ల మల్లేశ్వరి అనే దివ్యాంగురాలు తనకు ట్రై సైకిల్ ఇప్పించాలని కోరడంతో వెంటనే కలెక్టర్ జిల్లా మహిళా అభివృద్ధి అధికారిని రాదమ్మకు అదేశాలు జారీ చేయడంతో వెంటనే జేసీ సత్తయ్య చేతుల మీదుగా అందజేశారు.కలెక్టర్ స్వయంగా దరఖాస్తులను తీసుకున్నారు. ఇక నుంచి ప్రజల సమస్యలను వ్యక్తి గతంగానే కాకుండా జనహిత పిర్యాదుల కేంద్రం ద్వారా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ సత్యనారాయణ తెలిపారు. ఫిర్యాదులపై సంబందిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు పలు రకాలుగా ఫిర్యాదలు కేంద్రానికి దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇవ్వడం ద్వారా వాట్సప్, ఈమెయిల్ ద్వారా, మొబైల్ యాప్ ద్వారా డైరెక్ట్ వేబ్ పోర్టల్ ద్వారా జిల్లా ప్రజలు సెల్:9494181920 ద్వారా పంపవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలను కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జే.సీ సత్తయ్య, డీఆర్వో మణిమాల, జిల్లా గిరిజన సంక్షేమాధికారి గంగాధర్, జిల్లా మహిళా అభివృద్ధి అధికారి రాధమ్మ, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి అంజయ్య, బీసీ సంక్షేమా జిల్లా అధికారి దేవీదాస్, మైనార్టీ సంక్షేమ జిల్లా అధికారి సోమేశ్వర్, జనహిత టెక్నికల్ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పూర్తిస్థాయిలో నిండిన పోచారం ప్రాజెక్టు



ప్రాజెక్టు పూర్తిస్తాయిలో నిండిన దృశ్యం

**నాగిరెడ్డిపేట:** పోచారం ప్రాజెక్టు ఎట్టకేలకు సోమవారం ఉదయానికి పూర్తిస్థాయిలో నీటితో నిండిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.5 ఫీట్లు(1.82 టీఎంసీ) కాగా సోమవారం ఉదయం నాటికి ప్రాజెక్టులో 20.5 ఫీట్ల నీరు నిండడంతో ప్రాజెక్టు పూర్తిస్తాయిలో నిండిపోయింది. ప్రాజెక్టులోకి లింగంపేట వాగు ద్వారా కేవలం 300ల క్యూసెక్కులా వరద నీరు మాత్రమే వచ్చి చేరుతుండగా ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా పంటల సాగు కోసం 230 క్యూసెక్కులా నీటిని బయటికి వదులుతున్నట్లు నీటి పారుదల శాఖ ఏఈ కేశవరెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో ప్రాజెక్టు కట్టపై నుంచి తొలుకులు కిందికి ఇప్పుడిప్పుడే జారీ పడుతున్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక ప్రాజెక్టు ఇన్‌ఫ్లో తగ్గడంతో సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటి స్థాయి నిలకడగా నిలిచింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో గనక వర్షాలు కురిసినట్లయితే ప్రాజెక్టులోకి వర్షపు నీరు అధిక సంఖ్యలో వచ్చి చేరితే ప్రాజెక్టు పొంగిపొర్లినట్లు ఉంది.

## పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఉద్యోగుల ర్యాలీ

● తమ డిమాండ్‌ను ప్రభుత్వానికి నివేదించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

**కామారెడ్డి:** సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యచరణ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వానికి తమ డిమాండ్‌ను నివేదించాలని కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జాక్టో ప్రతినిధులు ఎంఏ హాది, ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, అంజయ్య, సుమిత్రానంద్, మనోహర్‌రావు, రవీందర్, ప్రవీణ్‌నాయక్, వెంకటిలు మాట్లాడుతూ పాత పెన్షన్ విదానాన్ని ప్రభుత్వం వెంటనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సామాజిక భద్రత లేకుండా సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న 1.20లక్షల మంది ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో గల ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గం ఆందోళనను ప్రత్యేక రిపోర్టు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు.తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిసరన ప్రదర్శనలు నిర్వహించి జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలను సమర్పించాలని తీర్మానించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలకు పిలుపు ఇచ్చినందున ఈ రోజు ఈ కార్యక్రమాన్ని చెపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరణ చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 1న చేపట్టనున్నా సాముహిక ధర్నాలో జిల్లాలోని ఉపాధ్యాయులందరు పాల్గొని నల్లబ్యాడ్జిలు ధరించి ధర్నా కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాక్టో సంఘం ప్రతినిధులు అనిల్ కుమార్, మనోహర్‌రావు, శ్రీనివాస్, బ్రహ్మం, రవీందర్, హది, సత్యనారాయణ, అంజయ్య, సుమిత్రానంద్ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల పెంపకందార్ల రాస్తారోకో

● సబ్సిడీ గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన



మద్నూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గొర్రెల పెంపకందార్లు

**మద్నూర్ :** రాష్ట్ర ప్రభుత్వం కుర్మ గొల్లలకు సబ్సిడీపై ఇచ్చిన గొర్రెలు మృత్యువాత పడుతున్నా ఇన్స్యూరెన్స్ క్లయిమ్ కావడం లేదంటు గొర్రెల కాపరులు రాస్తారోకో చేశారు.సోమవారం మండల కేంద్రానికి చెందిన కుర్మ, గొల్లలు తమకు ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన గొర్రెలు అర్ధాంతరంగా మృతి చెందున్నాయంటు మృతి చెందిన గొర్రెలతో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు క్రరైవార్ రాములు మాట్లాడతు కుర్మ, గొల్లలకు సబ్సిడీపై ఇచ్చిన గొర్రెలు తక్కువ ధరకు అనారోగ్యమైన గొర్రెలను అందజేశారని గొర్రెలు కొనుగులు చేసిన వారు తమ పర్సెంటేజీ తీసుకుని అనారోగ్యమైన గొర్రెలు ఇప్పించారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేసిన గొర్రెలు కోనుగోలుచేసిన వారం రోజులలోనే మృతి చెందుతున్నాయని వాటికి ఇన్స్యూరెన్స్ క్లయిమ్ కావడం లేదని ఆరోపించారు. గంట పాటు రాస్తారోకో జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఉప తహాసీల్దార్ ప్రమోద్ వచ్చి బాధితులకు హామీ ఇచ్చారు. ఇన్స్యూరెన్స్ క్లయిమ్ అయ్యే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. దీంతో శాంతించిన గొర్రెల కాపరులు రాస్తారోకో విరమించారు. రాస్తారోకోలో రాములు, కృష్ణపటేల్, అజయ్ తెప్పతుకారం, లబ్ధిదారులు సాయులు, అబ్బన్న తదితరులు పాల్గొన్నారు.


## ప్రమాదవశాత్తు ఐలాపూర్ చెరువులో పడి ఒకరి మృతి



సుభాష్ (ఫైల్)

**లింగంపేట :** లింగంపేట మండలంలోని ఐలాపూర్ గ్రామనికి చెందిన వన్నెపల్లి సుభాష్(45) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన సుభాష్ రెండు రోజులుగా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసి గాలింపు చేపట్టారు. సోమవారం గ్రామానికి చెందిన చెరువులో శవమై తెలాడు. కుటుంబ సభ్యుల పిర్యాదుమేరకు కేసునమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపాడు. మృతునికి తల్లి కంసవ్వ, భార్య సరస్వతి, కుమారుడు రాజప్రసాద్, కూతురు చైతన్యలు ఉన్నారు.

## ప్రాజెక్టుల సమాచారం



| | గరిష్ఠ మట్టం (అడుగుల్లో) | ప్రస్తుత మట్టం (అడుగుల్లో) | గరిష్ఠ నిల్వ (టీఎంసీల్లో) | ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో) | నీటి చేరిక (క్యూసెక్కుల్లో) | విడుదల (క్యూసెక్కుల్లో) |
|---|---|---|---|---|---|---|
| శ్రీరాంసాగర్ | 1,091.90 | 1,070.00 | 90.31 | 28.871 | 10,305 | 50 |
| నిజాంసాగర్ | 1,405.00 | 1,385.42 | 17.802 | 2.483 | 1165 | 611 |

## బంగారం ధరలు



| | | | |
|---|---|---|---|
| బిస్కెట్ బంగారం | 10 గ్రాములకు | రూ. | 30,400 |
| ఆర్నమెంట్ బంగారం | 10 గ్రాములకు | రూ. | 30,000 |
| వెండి | 10 గ్రాములకు | రూ. | 425 |

## సినిమా గైడ్ కామారెడ్డి



| | | |
|---|---|---|
| ప్రియా70 ఎంఎం | .. | నేనే రాజు నేనే మంత్రి |
| ప్రియా 35 ఎంఎం | .. | ఫిదా |
| శాంతి | .. | లై |
| దర్శన్ | .. | జయ జానకి నాయక |

## డయల్ యువర్ ఎస్పీకి తొమ్మిది ఫిర్యాదులు

**కామారెడ్డి:** జిల్లా కేంద్రంలో డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని ఉద యం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించినట్లు ఎస్పీ శ్వేతారెడ్డి తెలిపారు. జిల్లా నలుమూలాల నుంచి తొమ్మిది ఫిర్యాదుల వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. కామారెడ్డి పోలీసు స్టేషన్ పరిధి నుంచి -4, బాన్సువాడ, బిచ్కుంద, జుక్కల్, నసురుల్లాబాద్, ఎల్లారెడ్డి పోలీసు స్టేషన్ల పరిధి నుంచి ఒక్కో ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. సంబంధిత పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలను వి చారణ చేసి సమస్యను పరిష్కరించాలని అదేశించినట్లు ఎస్పీ తెలిపారు.

## ఇంటర్వ్యూ

### దొంగతనాల నివారణకు ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటు



శ్రీధర్‌కుమార్, ఎస్‌హెచ్‌వో, కామారెడ్డి

**ఆంధ్రజ్యోతి:** పట్టణంలో దొంగతనాలు జరుగుతున్నాయి. మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

**ఎస్‌హెచ్‌వో:** నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. అంతే కాకుండా పది టీమ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం.

**ఆంధ్రజ్యోతి:** దొంగతనాల నివారణకు ఎలాంటి సూచనలు చేస్తున్నారు?

**ఎస్‌హెచ్‌వో:** పట్టణ ప్రజలకు ఆటో మైక్ పెట్టి అవగాహన కల్పిస్తున్నాం. తాళం వేసి వేరే గ్రామాలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించాలని సూచిస్తున్నాం.అంతే కాకుండా బయటకు తాళం కనిపించే విధంగా వేయకుండా లోపలికి తాళం వేసి వేళ్లే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** వినాయక మండపాలను చూసేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి సూచనలు చేస్తున్నారు?

**ఎస్‌హెచ్‌వో:** మండపాలను చూడడానికి వచ్చే వారు ఇంటి వద్ద జాగ్రత్తలు తీసుకొని వచ్చి వెళ్లాలని సూచిస్తున్నాం. అంతే కాకుండా ప్రతీ కాలనీలో పోలీసు టీమ్‌తో బందోబస్తును ఏర్పాటు చేశాం.

**ఆంధ్రజ్యోతి:** మండపాల వద్ద కూడా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

**ఎస్‌హెచ్‌వో:** మండపాలకు వచ్చే భక్తులు తొక్కిసలాట ఉండకుండా క్యూపద్ధతిలో వినాయకులను దర్శించుకోవాలని సూచించాం. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించిన సమీపంలో ఉన్న పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరుతున్నాం.

## లెన్స్ స్టోరీ

### చెత్తను తొలగించరూ...



కామారెడ్డి పట్టణంలోని గడీ రోడ్‌లో వారం రోజులుగా చెత్త పేరుకు పోయింది. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

**- కామారెడ్డి**

# అపరిశుభ్రంగా బస్టాండ్ మూత్రశాలలు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు




అపరిశుభ్రంగా ఉన్న మూత్ర శాలలు ఇవే..

**కామారెడ్డి:** కామారెడ్డి కొత్త బస్టాండ్ ఆవరణలో ఉన్న మూత్ర శాలలు అపరిశుభ్రంగా ఉండడంతో కంపుకొడుతున్నాయి.బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులు నిలబడాలంటేనే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురిస్తుందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూత్ర శాలలు సరిగా లేకపోవడంతో విచ్చల విడిగా మూత్ర విసర్జన చేయడంతో చుట్టు పక్కల దోమలు, ఈగలు విపరితంగా తయారవుతున్నాయి. దీంతో బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన క్యాంటిన్, ఫ్రూట్స్, మిని బేకరిల దుకాణాల్లోకి దోమలు, ఈగలు చొచ్చుకెళ్లడంతో అక్కడ తయారు చేసిన వాటి పై నిలువ ఉంటున్నాయి. బస్టాండ్ ఆవరణలో చుట్టూ ఎక్కడపడితే అక్కడ మూత్ర విసర్జన చేయడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడుతుంది. అంతే కాకుండా ఎక్కడి నుండే దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఆకలితో అలమటిస్తూ ఎమి చూడకుండా వారికి కావాల్సినవి కొనుగోలు చేసి తేనేస్తున్నారు. దీంతో ప్రయాణికులు అనారోగ్యాలకు గురికావాల్సిన పరిస్తితి ఏర్పడుతుంది. దీనికి కారణం ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యమేనని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లో ఉన్న ఏ ఒక్క మూత్ర శాలలు, బాత్‌రూమ్స్ ఒక్కటి కూడా శుభ్రంగా ఉండడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.ఒక్క సారి కూడా ఆర్టీసీ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో సిగ్గుచేటుగా ఉందని ప్రయాణికులు మండిపడుతున్నారు.డిపో మేనేజర్ ఉండే డిపో కార్యాలయం సమీపంలోనే మూత్ర శాలలు పైపులు పగిలిపోవడంతో మూత్ర విసర్జన నిల్వగా ఉండిపోతుంది. అలాగే మూత్ర విసర్జన నిలువ ఉండడంతో అక్కడి నుంచి ప్రయాణించే ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది ముక్కు పట్టుకోవాల్సిందేనని అంటున్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వచ్ఛభారత్ అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఎక్కడ కూడా చెత్త, చెదారం లేకుండా చూడాలని ప్రభుత్వ అధికారులకు సూచించిన అధికారులు మాత్రం నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.ప్రభుత్వ సంస్థల్లో పరిస్థితి ఇంత దారుణమా అని కొంత మంది ప్రయాణికులు అంటున్నారు. బస్టాండ్ ఆవరణలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### కామారెడ్డిలో చోరీ..

## క్లూస్ టీమ్ పరిశోదనలో దొరికిన బంగారం

**కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలోని సైలాన్ బాబా కాలనీలోని వాయిద్ అలీ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి బీర్వాలను ధ్వంసం చేసి వెళ్లారు. ఇంటి యాజమాని బందువుల ఇంటికి వెళ్లే టప్పుడు బీర్వాలో ఉన్న 14 తులాల బంగారాన్ని ఇంట్లోనే వేరేప్రాంతంలో దాచి పెట్టి వెళ్లాడు.సోమవారం వచ్చి చూడగా 14 తులాల బంగారు నగలు చోరీ జరిగినట్లు బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌వో శ్రీధర్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి పరిశీలించారు. బీర్వాలో ఉన్న నగలు ఇంట్లో వేరే చోట దాచిన విషయం ఇంటి యజమాని వాయిద్ అలీకి గుర్తుకు రావడంతో అక్కడ క్లూస్ టీమ్‌తో తనిఖీ చేయించగా 14 తులాల బంగారం దొరికింది. దీంతో బాధితుడు సంతోషించాడు. బీర్వాలోనే ఉంటే 14 తులాల బంగారం పోయేదని తెలిపారు. దీంతో ఎస్‌హెచ్‌వో శ్రీధర్‌కుమార్ మాట్లాడుతూ ఇంట్లో బీర్వాల్లో బంగారం, నగదు డబ్బులను ఇంటికి తాళం వేసి వెళ్లినప్పుడు బీర్వా నుంచి తీసి వేరే ప్రదేశాల్లో దాచుకొని వెళ్లాలని,అలాగే పోలీసులు సమాచారం ఇస్తే తాళం వేసిన ఇళ్లను పర్యవేక్షిస్తామని తెలిపారు.

## రేపు దోమకొండలో 'అచారీ టోర్నమెంట్' క్రీడాకారుల ఎంపిక

**కామారెడ్డి:** జిల్లాలోని దోమకొండ మండలంలో గడికోట వద్ద బాలబాలికల సెలక్షన్స్‌ను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారి మధన్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. విలువిద్య క్రీడా పోటీలు రెండు విభాగాల్లో జరుగుతాయని తెలిపారు. ఇండియన్ రౌండ్, ఫీటా రౌండ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసక్తి గల విద్యార్థులు బోనోఫైడ్ సర్టిపికేట్‌తో హాజరు కావాలని తెలిపారు. గెలుపొంది ఎంపికైన క్రీడకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు తరపున పాల్గొంటారన్నారు. అచారీ క్రీడకారులు దోమకొండ బాలుర ఉన్నత పాఠశాల పీడీ నర్సింహారెడ్డికి రిపోర్టు చేయాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వహన కార్యదర్శి వెంకటి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న హాకి టోర్నమెంట్ సెలక్షన్ కామారెడ్డి ఇందిరా గాంధీ స్టేడియంలో అండర్ -14, 17 బాల బాలికలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసక్తి గల వారు బోనోఫైడ్ సర్టిఫికేట్‌తో హాజరు కావాలని కోరారు. కరడ్‌పల్లి పీఈటీ ఆంజనేయులుకు రిపోర్టు చేయాలని ఏజీఎఫ్ కార్యదర్శి తెలిపారు.

## నేడు కామారెడ్డికి మంత్రులు జూపల్లి, పోచారం రాక

**కామారెడ్డి రూరల్ :** కామారెడ్డికి మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌లు వస్తున్నట్లు కామారెడ్డి ఎంపీపీ లద్దూరి మంగమ్మ, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిప్పిరి ఆంజనేయులు, ఆత్మకమిటీ ఛైర్మన్ బల్వంత్‌రావులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడారు. కామారెడ్డిలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ భవనాన్ని ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. బహిరంగ సభ అనంతరం కామారెడ్డి పార్శి రాములు కల్యాణ మండపంలో వివిధ శాఖల అధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు లద్దూరి లక్ష్మీపతియాదవ్, మిన్కూరి రాంరెడ్డి, సోమన్నగారి ఈశ్వర్ పాల్గొన్నారు.

## ఐకేపీ సిబ్బంది అర్ధనగ్న ప్రదర్శన



కామారెడ్డిలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న ఐకేపీ సిబ్బంది

**కామారెడ్డి రూరల్ :** మండల సమాఖ్యలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె సోమవారం నాటికి 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం సిబ్బంది అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ...గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో మండల సమాఖ్య ప్రభుత్వ పథకాలను అమలు చేస్తోంది.కానీ మండల సమాఖ్య సిబ్బంది సెర్ప్ పరిధిలో లేరని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయమై సెర్ప్ సీఈవోను కలిసి తమ న్యాయమైన డిమాండ్లను, సమస్యలను వివరించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది వరకు సిబ్బంది వెళ్లినట్లు తెలిపారు. అయితే సీఈవో తమ డిమాండ్ల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. జిల్లా నుంచి హైదరాబాద్ తరలి వెళ్లిన వారిలో తనతో పాటు జిల్లా సభ్యులు లత, అనీల, నరేష్, యశ్వంతక్క, సాయిలు, వెంకట్‌రెడ్డిలు ఉన్నారని తెలిపారు.

## 'సీపీస్ విధానాన్ని రద్దు చేయాలి'

**తాడ్వాయి:** ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తాడ్వాయి మండల పీఆర్టీయూ ఆధ్యక్షులు రాంచంద్రారెడ్డి కోరారు. తాడ్వాయి మండలం దేమికలాన్ ఉన్నతపాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు సాముహికంగా ప్రధానోపాధ్యాయులకు సెప్టెంబర్ 1న సెలవు కోరుతూ సెలవు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానంతో ఎంతో మంది ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు. వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేశ్, నర్సింగ్‌రావు, ఉపాధ్యాయులు అరుణ,కవిత పాల్గొన్నారు.

## 'ప్రతీ గ్రామంలో హరితహారం టార్గెట్‌ను పూర్తి చేయాలి'

**భిక్కనూరు:** ప్రతీ గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన మొక్కలను టార్గెట్ ప్రకారం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని ప్రతీ గ్రామంలో టార్గెట్‌ను పూర్తి చేసేలా ఎంపీడీవో గోపాల్‌రావు, ఎంపీపీ సుదర్శన్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో మొక్కలను విరివిరిగా నాటాలని ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసేందుకు గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు

**భిక్కనూరు:** మండల కేంద్రంలో ఆయా గ్రామాల్లోని గణేష్ మండపాల వద్ద సోమవారం గణేష్ నవరాత్రుల్లో భాగంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని యువజన సంఘాలు,కులసంఘాలు,వీడీసీల ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా గననాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం: ఎంపీడీవో

**గాంధారి:** మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం రోజు ఎంపీపీ యశోధబాయి ఆధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాయాగౌడ్ తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు, సింగిల్‌విండో చైర్మన్‌లు, సాగునీటి చైర్మన్‌లు, హాజరు కావాలని ఆయన తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

# డీలా పడుతున్న డిజిటల్ విద్య

● సిగ్నల్ అందక విద్యార్థుల ఇబ్బందులు

**సదాశివనగర్ రూరల్:** ప్రభుత్వం నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని విద్యార్థులకు డిజిటల్ తరగతుల ద్వారా నూతన పరిజ్ఞానాన్ని అందించాలన్నా ముఖ్య ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన డిజిటల్ విద్య రోజురోజుకు డీలా పడిపోవడంతో విద్యార్థులు ఆసహానానికి గురవుతున్నారు. ఉపాధ్యాయులు అందించే విద్య విద్యార్థులు బట్టి పెడితే కాని తలకెక్కదని ఆట పాటలద్వారా, చిత్రాల ద్వారా డిజిటల్ విద్య అందిస్తే విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరిగి త్వరగా మెదోసంపత్తు పెరుగుతుందన్నా ఆలోచనతో ఏర్పాటు చేసిన డిజిటల్ విద్య ఏర్పాట్లలో తగు జాగ్రత్తలు చేపట్టకపోవడం వల్ల వేలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పరికరాలు కొన్ని పాఠశాలల్లో ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. మండలంలోని ఆదర్శపాఠశాల, కల్వారాల్, పద్మాజివాడి, తుక్కోజివాడి, భూంపెల్లి, కుప్రియాల్, పాఠశాలల్లో డిజిటల్ విద్యను అందించడానికి ఏర్పాటు చేసిన టాటా స్కై సక్రమంగా సిగ్నల్ అందింకపోవడంతో ప్రొజెక్టర్‌లు, స్క్రీనర్‌లు వృథాగా ఉంటున్నాయి. కొన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన టాటా స్కైలు కోతులు చెడగొట్టడంతో భూంపెల్లి పాఠశాలలో డిజిటల్ తరగతి గదిని తెరిచిన దాకలాలు కనిపించడం లేదు. తుక్కోజివాడి పాఠశాలలో మైదానంలో తాత్కలికంగా అవరణలో టాటా స్కైని సిగ్నల్ కోసం ఉంచుతూ సాయంత్రం వేళ తీసివేయడంతో సమయానికి సిగ్నల్ అందక పోగా ఒక వేళ సిగ్నల్ ఉన్న అదే సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఆ తరగతి విద్యార్థులకు ఆ రోజు డిజిటల్ విద్యకు దూరం కావాల్సి వస్తుంది. విద్యుత్ అంతరాయం, సిగ్నల్ దోరకని పరిస్థితుల్లో విద్యార్థులకు డిజిటల్ విద్య ఏ మాత్రం అందడం లేదు. ఆదర్శ పాఠశాలలో మాత్రమే హర్డ్ డెస్క్ ద్వారా సీడీలు వేసి విద్యార్థులకు విద్యను అందించే ప్రయత్నం చేస్తున్నప్పటికి విద్యార్థులకు ఉపయోగకరంగా లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు డిజిటల్ విద్యను వీక్షించడానికి సుముకత చూపడం లేదు.విద్యార్థులకు పాఠ్యాంశాలకు సంబందించిన సీడీలను అందుబాటులో తీసుకువచ్చి హార్డ్ డెస్క్‌లు ఏర్పాటు చేసి విద్యను అందిస్తేనే ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.



పద్మాజివాడిలో సిగ్నల్ అందని ప్రొజెక్టర్



తుక్కోజివాడిలో సిగ్నల్ కోసం తాత్కలికంగా ఏర్పాటు చేసిన టాటా స్కై

## ఇంటర్వ్యూ

### రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచుతున్నాం



సయ్యాద్ జావిద్, సీఈవో సదాశివనగర్

**ఆంధ్రజ్యోతి:** ఈ సంవత్సరం ఎరువులు, విత్తనాల అమ్మకాలు ఎంత నిర్వహించినారు?

**సీఈవో:** సహాకార సంఘ పరిధిలో రూ.60లక్షల విలువ గల విత్తనాలు, రూ.70 లక్షల ఎరువులను అమ్మకాలు కొనసాగించాం.

**ఆంధ్రజ్యోతి:** ప్రస్తుతం ఎరువుల నిల్వ ఎంత ఉంది?

**సీఈవో:** సహాకర సంఘ గోదాంలో 500ల బస్తాల యూరియా, 200ల బస్తాల (20-20) కాంపోజిట్, 200ల బస్తాల పొటాష్ ఎరువులు నిలువ ఉన్నాయి.

**ఆంధ్రజ్యోతి:** ఈ సంవత్సరం పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు ఎన్ని అందించారు?

**సీఈవో:** ఖరీఫ్ సీజన్‌లో రూ.3.60 కోట్ల పంట రుణాలు అందించగా రూ.2.70 కోట్ల దీర్ఘకాలిక రుణాలు అందజేశాం.

**ఆంధ్రజ్యోతి:** ప్రస్తుతం సహాకర సంఘంలో ఎంతమంది సభ్యులున్నారు? ఎంత మంది వాటా ధనం చెల్లించారు?

**సీఈవో:** సహాకార సంఘంలో నేటి వరకు 2300ల సభ్యులు ఉండగా 1180 మంది వాటాధనం కలిగిన వారు ఉన్నారు.

**ఆంధ్రజ్యోతి:** రబీ సీజన్‌లో ఎన్ని క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేశారు, సహాకార సంఘానికి కమీషన్ ఎంత లభించింది.?

**సీఈవో:** రబీ సీజన్‌లో 16వేల క్వింటాల వరి ధాన్యం కొనుగోలు చేయగా దాని నుంచి రూ.5లక్షలు సహాకార సంఘానికి లాభం చేకూరింది.

**ఆంధ్రజ్యోతి:**సహాకార సంఘం ద్వారా సన్నబియ్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారా?

**సీఈవో:** ఇప్పటివరకు రూ.9లక్షల విలువ గల సన్న బియ్యం అమ్మకాలు నిర్వహించాం. ప్రస్తుతం 40 క్వింటాళ్ల బియ్యం అందుబాటులో ఉన్నాయి. క్వింటాలు ధర రూ.3500.

- సదాశివనగర్ రూరల్

### సదాశివనగర్ మండల వ్యవసాయ విస్తీర్ణాధికారుల ఫోన్ నెంబర్లు

కుప్రియాల్ - 8341940905

సదాశివనగర్ - 9849207196

ధర్మారావుపేట్ - 8184878504

ఉత్నూరు - 9553077385

పద్మాజివాడి - 90109724270

లింగంపల్లి - 8008520164

## అభివృద్ధికే నంద్యాల ప్రజల పట్టం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి



ఎల్లారెడ్డిలో టపాసులు పేల్చి సంబురాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

**ఎల్లారెడ్డి టౌన్ :** ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికలలో అక్కడి ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టడంతో టీడీపీ అభ్యర్థి గెలుపొందారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి సుభాష్ రెడ్డి అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నేతలు నంద్యాలలో టీడీపీ గెలుపును పురస్కరించుకొని కార్యాలయ ఆవరణలో టపాకాయలు పేల్చి సంబురాలు నిర్వహించగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రధేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధికి నంద్యాల ప్రజలు పట్టం కట్టారని, ఇందుకు టీడీపీ అభ్యర్థి గెలుపే నిదర్శనమని అన్నారు. యావత్తు దేశం ఆసక్తిగా చూసిన ఈ ఎన్నికలలో అవినీతికి, పారదర్శక పాలనకు జరిగిన సమరంలో టీడీపీ అభ్యర్థి గెలుపొందారని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలోనూ టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో పార్టీ తిరిగి పూర్వవైభవాన్ని సంతరించోకునందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, పరాంధాములు, శ్రీనివాస్‌రెడ్డి, జలంధర్ రెడ్డి, చిరంజీవులు, గోవింద్ పాల్గొన్నారు.

## సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తహసీల్దార్‌కు వినతి

**లింగంపేట :** ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి జీపీఎఫ్ విదానాన్ని కొనసాగించాలని డిమీండ్ చేస్తూ సోమవారం సీపీఎస్ సంఘం పిలుపుమేరకు సెప్టంబర్ 1న సామూహిక సెలవుపెడుతూ రెవెన్యూ ఉద్యోగులు, పంచాయతీ ఉద్యోగులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ గణేశ్, వీఆర్‌వోలు ధర్మయ్య, హన్మండ్లు రాజేశ్వర్‌లతో పాటు పంచాయితీ ఉద్యోగులు శ్రీనివాగౌడ్, రాజయ్య, మల్లయ్యలతో పాటు ఉద్యోగులు ఉన్నారు.

### గాంధారిలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరన..

**గాంధారి:** మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం ఆవరణలో సోమవారం మండలంలోని ఉపాధ్యాయులు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 1న సాముహిక సెలవుతో ఉపాధ్యాయులు జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమంలో పాల్గొనుటకు ఈ వాల్‌పోస్టర్‌ను అవిష్కరించారు. ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం వల్ల కొన్ని వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు పెన్షన్ రాకుండా నష్టపోతున్నారని వారు తెలిపారు. ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న జిల్లాలో తలపెట్టె నిరసన కార్యక్రమాలకు ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు ప్రకాశ్, లక్ష్మన్, సాహేందర్, మాణిక్యం, జనార్దన్, వెంకటి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తహసీల్ కార్యాలయం వద్ద అన్నదానం

**లింగంపేట :** లింగంపేట తహసీల్ కార్యాలయం వద్ద మొదటి సారిగా వినాయకమండపాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మండపం వద్ద రెవెన్యూ అధికారులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా వేడుకలను నిర్వహించుకోవాలని తహసీల్దార్ మోతీసింగ్ భక్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సంపత్‌కుమార్, ఎంపీడీవో శంకర్‌రెడ్డి ఈవోపీఆర్‌డీ వెంకటేశం, డీటీ గంగాధర్, ఆర్ఐ గణేశ్‌తో పాటు వీఆర్‌వోలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి'



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇట్టం సిద్ధరాములు

**భిక్కనూరు:** ప్రభుత్వం సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇట్టం సిద్దరాములు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని జంగంపల్లి గ్రామంలో నిర్వహించిన శక్తి కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి రాకముందు ఎన్నో ప్రగల్బాలు పలికిన సీఎం కేసీఆర్ మదిలీష్ పార్టీకి బయపడి సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించడం లేదని అరోపించారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సింగం శ్రీను, ప్రతినిధులు శ్రీనివాస్‌యాదవ్, ప్రవీన్‌గౌడ్, పుల్లూరి నర్సింలు, తిర్మల్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## ప్రజావాణికి హాజరుకాని అధికారులకు మెమోలు

**తాడ్వాయి:** ప్రజావాణికి హాజరు కాని అధికారులకు మెమోలు ఇచ్చినట్లు తాడ్వాయి తహసీల్దార్ బాసిత్ తెలిపారు. తాడ్వాయిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి హాజరు కాని అధికారులకు మెమోలు ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్సై, ఎంపీడీవో, ట్రాన్స్‌కో ఏఈ, ఈవో ఆర్డీ, సాక్షరభారత్ కో ఆర్డీనేటర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలకు మెమోలు ఇచ్చినట్లు తెలిపారు. బాధ్యతగా ప్రజావానికిహాజరు కావాల్సి ఉండగా అధికారులు హాజరు కావడం లేదన్నారు.

## ఆత్మకూర్‌లో బాలవికాస్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**నాగిరెడ్డిపేట:** మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బాలవికాస్ వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంటును సోమవారం గ్రామానికి చెందిన కుంట రాఘవరెడ్డి ప్రారంభించారు. ఈ ప్లాంటు ఏర్పాటు కోసం రూ.2లక్షలతో స్వచ్ఛందంగా భవనాన్ని రాఘవరెడ్డి నిర్మింపజేశారు. బాలవికాస్‌కు చెందిన సంస్థవారు గ్రామంలో వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం కార్యదర్శి మనోహర్‌రెడ్డి, బాలవికాస్ ఇన్‌చార్జీలు బాలమోహణ్‌రెడ్డి, రాజశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దారి కనుక్కోండి



## జంబ్లింగ్ వర్డ్స్

1. LBIL ▶ ..................
2. DEIS ▶ ..................
3. WLLA ▶ ..................
4. DERI ▶ ..................

## జంతర్ మంతర్

1. బంనుఅధం ▶ ..................
2. తరంనిరం ▶ ..................
3. లపాపాడి ▶ ..................
4. చపందార ▶ ..................



## మీకు తెలుసా?




ఇంగ్లాండ్‌కు 600 ఏళ్లపాటు 'ఫ్రెంచ్' అధికార భాషగా కొనసాగింది.

## టంగ్ ట్విస్టర్స్

1. A big black bug bit a big black bear and made the big black bear bleed blood.
2. Larry Hurley, a burly squirrel hurler, hurled a furry squirrel through a curly grill.
3. The king would sing, about a ring that would go ding.
4. National Sheepshire Sheep Association

## ఔనా!



కవలలకు కూడా వేలిముద్రలు ఒకేలా ఉండవు.

## సూక్తి

ఏ పనిలోనైనా అత్యుత్తమ ప్రదర్శన చూపించు. అప్పుడు ఒక విజయం మరో విజయానికి పునాదిగా నిలుస్తుంది.

# ఆకాశమే హద్దుగా..



**నిండైన ఆత్మవిశ్వాసంతో.. ఏదైనా చేయగలను.. ఎప్పటికైనా సాధించగలను అని అడుగు ముందుకు వేస్తే... విధి వెక్కిరించినా.. సంకల్పంతో అనుకున్నది సాధిస్తే.. ఈ ప్రపంచమే నీకు సలామ్ చేస్తుంది. సమాజం కీర్తిస్తుంది. ప్రతి ఒక్కరూ నిన్ను చూసి స్ఫూర్తి పొందుతారు. పుట్టుకతోనే రెండు చేతులు లేకపోయినా ఏనాడూ అధైర్యపడలేదా చిన్నారి. వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఐదేళ్లకే సైకిల్ నేర్చుకుని ఔరా అనిపించుకుంది రూత్ ఎవ్లిన్ ప్రాంకే.**



ఆమె పేరు రూత్ ఎవ్లిన్ ప్రాంకే. పుట్టుకతోనే చేతులు లేవు. కానీ ఆ చిన్నారిలో పట్టుదల మాత్రం కొండంత ఉంది. ఏదైనా చేయగలను అనే ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. అందరిలానే తాను అన్ని పనులు చేసుకోగలదు. బ్రష్ చేసుకుంటుంది, బొమ్మలకు రంగులేస్తుంది, హోంవర్క్ అయితే సరేసరి! అన్నం కూడా తింటుంది. ఇటీవలే తాను సైకిల్ రైడ్ చేయడం కూడా నేర్చుకుంది. వైద్యులు ప్రత్యేకంగా రూపొందించిన 'బ్రేసెస్' ఆధారంగా రూత్ సైకిల్ హ్యాండిల్ చేస్తుంది. అమెరికాలోని మిన్నసోటాలో రూత్ కుటుంబం ఉంటుంది.

### రూత్ సంకల్పానికి ఆమే కారణం

జెస్సికా కాక్స్‌కు కూడా పుట్టుకతోనే రెండు చేతులు లేవు. జీవితంలో ఎన్నో అవరోధాలు దాటి తనకంటూ ఓ స్థానం సంపాదించుకున్న ధీర వనిత ఆమె. ప్రపంచంలోనే తొలి 'ఆర్మ్‌లెస్ ఎయిరోప్లేన్ పైలట్'గా చరిత్ర సృష్టించింది. గ్రాడ్యుయేట్ డిగ్రీతో పాటు, తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సాధించింది. మోటివేషన్ స్పీకర్‌గా ఎంతోమందిలో స్ఫూర్తినింపుతోంది. 'దివ్యాంగుల'కు మెంటర్‌గా వ్యవహరిస్తోంది. పియానో అద్భుతంగా ప్లే చేస్తుంది. జెస్సికా జీవితకథ 'రైట్ ఫుటెడ్' పేరుతో డాక్యుమెంటరీగా వచ్చింది. రూత్ తల్లి కర్లీన్ 'జెస్సికా' గురించి చెప్పడంతో రూత్ ఆలోచనల్లో ఎంతో మార్పు వచ్చింది. ఆ చిన్నారి ఆ రోజు నుంచి జెస్సికాను కలవాలని ఉవ్విళ్లూరింది.

### కల ఫలించింది.



కర్లీన్ తన కూతురు కోరిక తీర్చడానికి జెస్సికా గురించి గూగుల్‌లో ఎంతో శోధించింది. జెస్సికా ఫేస్‌బుక్ అకౌంట్ తెలుసుకుని తనతో మాట కలిపింది. తన కూతురు పరిస్థితి గురించి జెస్సికాకు వివరించింది. ఆ చిన్నారి కోరికనూ తెలియజేసింది. రూత్‌ను కలవడానికి జెస్సికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతే కూతురిని తీసుకుని కర్లీన్ అరిజోనాకు బయలుదేరింది. రూత్ కల ఫలించే సమయం రానే వచ్చింది. రూత్‌కు వంద అడుగుల దూరంలో జెస్సికా నిలుచుంది. ఒకరినొకరు చూసుకున్న ఆ ఇద్దరూ కొన్ని సెకన్ల పాటు నిశ్శబ్దంగా ఉండిపోయారు. రూత్, జెస్సికా దగ్గరికి ఆప్యాయంగా పరుగెత్తింది. చేతులు లేకపోతేనేం.. ప్రేమతో ఇద్దరూ ఆలింగనం చేసుకున్నారు. ఈ ఫొటో నెట్‌లో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

'రూత్‌ను చూడగానే నా చిన్నతనం గుర్తుకు వచ్చింది. నన్ను నేను మరోసారి తనలో చూసుకున్నాను. ఎంతో దూరం ప్రయాణించి నన్ను కలవడానికి వచ్చారు. ఆ ప్రేమను మాటల్లో చెప్పలేను. రూత్‌ను నాతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడింది. "నువ్వు నడిపే ఎయిర్‌ప్లేన్ ఏదీ" అని అడిగింది. వెంటనే తనను అక్కడికి తీసుకువెళ్లాను. అది చూసి రూత్ ఎంతో ఆనందించింది.'

**- జెస్సికా కాక్స్**



## నవ్వుల్ నవ్వుల్

శ్రీధర్ : అలా వర్షంలో తడిసి వచ్చేకంటే ఓ గొడుగు కొనుక్కొని రావచ్చు కదా!

మిస్టర్ మేధావి : కొన్నాను. కొత్తది కదా.. తీస్తే తడిసిపోతుందని... వాడలేదు.

శ్రీధర్ : !!!!!!!!

## చెప్పగలరా?

చీరలో ఉన్నా కానీ
మూరలో లేను
కరువులో ఉన్నా కానీ
ఎరువులో లేను
తాటిలో ఉన్నా కానీ
తారులో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో
చెప్పగలరా?

## జవాబులు

**చెప్పగలరా? :** చీకటి


**జంతర్‌మంతర్:**

1. అనుబంధం 2. నిరంతరం
3. పాలపొడి 4. పంచదార

**జంబ్లింగ్ వర్డ్స్:**

1. BILL 2. SIDE
3. WALL 4. RIDE

## చుక్కలు కలపండి



# లక్ష్యాన్ని చేరుకోని పంటరుణాలు

**● నిజామాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు ఇచ్చింది రూ. 935 కోట్ల రుణాలే! ● పంటల బీమాపైనా కొరవడిన స్పష్టత**

(ఆంధ్రజ్యోతి - నిజామాబాద్)

ఖరీఫ్ మొదలై మూడు నెలలు గడిచిపోయింది. ఇప్పటికీ రుణాల పంపిణీ పూర్తికాలేదు. నిర్ణయించిన లక్ష్యం చేరుకోలేదు. రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా పంపిణీలో మాత్రం వేగం లేదు. వేసిన పంటలకు బీమా సౌకర్యం కల్పించలేదు. రుణాలు ఇచ్చే వారందరికీ బీమా సౌకర్యం కల్పిస్తామని చెబుతున్నా ఇప్పటి వరకు మాత్రం ఆయా బ్యాంకుల అధికారులు మాత్రం వివరాలు ఇవ్వలేదు. ఏ పంటలకు బీమా చెల్లించారో వెల్లడించలేదు. నిజామాబాద్ జిల్లాలో రెండు దఫాలుగా పడిన వర్షాలతో రైతులు సాగును పెంచారు. రుణాల కోసం ఎదురుచూస్తున్నారు. మంత్రితో సహా కలెక్టర్ ఎన్నిమార్లు సమీక్షించినా ఫలితం మాత్రం మారడం లేదు. గ్రామస్థాయిలో అదేవిధంగా కొనసాగుతుంది. రుణాల పంపిణీకి మరో నెల మాత్రమే మిగిలి ఉండటంతో రైతుల్లో నిరాశ కనిపిస్తోంది. ఇప్పటి వరకు కౌలు రైతులకు మాత్రం ఎలాంటి రుణాలు పంపిణీ చేయలేదు. జిల్లాలో ఈ యేడాది ఖరీఫ్‌లో నిర్ణయించిన లక్ష్యానికి అనుగుణంగా పంటల సాగు కాలేదు. అధికారులు నిర్ణయించిన లక్ష్యం ప్రకారం సాగు పెరగలేదు. ఈ యేడాది ఖరీఫ్‌లో 4.82 లక్షల ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఆ పంటలకు అనుగుణంగా విత్తనాలతో పాటు ఎరువులను అందుబాటులో ఉంచారు. జూన్, జూలై మాసాల్లో వర్షాలు ఎక్కువగా పడకపోవడం వల్ల పంటల విస్తీర్ణం పెరగలేదు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరి విస్తీర్ణం బాగా పెరిగింది. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 3.91 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.

జిల్లాలో అత్యధికంగా వరిసాగు ఎక్కువగా అయ్యింది. మొదట బోర్లకింద సాగు చేసిన రైతులు ఆ తర్వాత నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో గుత్ప, అలీసాగర్ లిఫ్టుల కింద కూడా వరి సాగు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 2లక్షల 524 ఎకరాల వరిసాగు చేశారు. ఈనెలలో కురిసిన రెండు భారీ వర్షాలతో వరిసాగు పెరిగింది. వరిసాగు తర్వాత అత్యధికంగా జిల్లాలో సోయాబీన్‌ను వేశారు. లక్షా 3వేల 686 ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారు. 46వేల 455 ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేశారు. వీటితో పాటు ఇతర పంటలను రైతులు వేశారు. జూన్, జూలైలో వర్షాలు లేకపోవడం ఎండ భారీగా ఉండటంతో అతి కష్టం మీద రైతులు పంటలను కాపాడుకున్నారు. వర్షాలు పెరిగిన సగటుకు చేరుకోలేదు. అయినా ప్రస్తుతం పడిన వర్షాలతో రైతులు ఖరీఫ్ పంట నుంచి బయటపడే అవకాశం ఏర్పడింది. చెరువులకు నీళ్లు రావడం వల్ల భూగర్భ జలాలు పెరిగాయి. జిల్లాలో రైతులు డబ్బుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నా బ్యాంకర్ల నుంచి రుణాల పంపిణీ మాత్రం పెరగలేదు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 1,560 కోట్ల రూపాయల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మూడు నెలలో మాత్రం ఇప్పటి వరకు 935 కోట్ల రూపాయలు మాత్రమే రుణాలుగా ఇచ్చారు. నిర్ణయించిన లక్ష్యంలో కేవలం 60 శాతం వరకే రుణాల పంపిణీ పూర్తి చేశారు. ఇప్పటి వరకు నిర్ణయించిన లక్ష్యాన్ని చేరుకోలేదు. రైతులకు ఖరీఫ్‌లో ఎక్కువగా జూన్, జూలై, ఆగస్టు నెలల్లోనే డబ్బులు అవసరం ఎక్కువగా ఉంటుంది. సెప్టెంబరు నెలలో రుణాలు అవసరం తక్కువగా ఉంటుంది. ఈ మూడు నెలలే రైతులకు కీలకం. ఈ సమయంలోనే బ్యాంకుల నుంచి రుణాలు అందితే రైతులు ప్రైవేటు అప్పులకు పోకుండా ఉండే అవకాశం ఉంది. ఈ సమయంలోనే బ్యాంకు అధికారులు ఇతర పథకాల పేరుమీద పంపిణీ వేగంగా చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటితో పాటు పలు పంటలకు బీమా సౌకర్యాన్ని కల్పించాలి. చాలా పంటలకు ఆగస్టు 15తోనే గడువు ముగిసింది. వరిపంటకు ఈ నెలాఖరుతో గడువు ముగియనుంది. కానీ ఇప్పటి వరకు మాత్రం బ్యాంకు అధికారులు ఎంతమంది రైతులు వేసిన పంటకు భీమా సౌకర్యం కల్పించారో వివరాలను అందించ లేదు. నిజామాబాద్ జిల్లాలో ఎక్కువగా వరి, మొక్కజొన్న, సోయా పంటలనే రైతులు వేశారు. ఈ పంటలకే బీమా అవసరం ఎక్కువగా ఉంటుంది. వీటితో పాటు పసుపు సాగును రైతులు చేశారు. ఈ పంటలకు బీమా వర్తింపజేస్తే నష్టపోయిన రైతులకు పరిహారం అందే అవకాశం ఉంటుంది. గత సంవత్సరం ఒకే పంటకు నిజామాబాద్ జిల్లాలో ఎక్కువగా బీమా చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వం ఈ చర్యను తప్పుపట్టింది. పరిహారం చెల్లింపులో కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. గత సంవత్సరం రైతులు వరి వేసినా కూడా సోయా, ఇతర పంటలకు బీమా కల్పించారు. వరి పంట వేసిన రైతులు పంట నష్టపోతే పరిహారం అందించని పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం రైతులు వేసిన పంటలకే బీమా సౌకర్యం కల్పిస్తే రైతులకు మేలు జరుగనుంది. జిల్లా బ్యాంకర్ల సమావేశం నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నేడు జరుగనుంది. ఈ సమావేశంలో బ్యాంక్ శాఖల ఆధారంగా సమీక్ష నిర్వహిస్తే జిల్లాలోని రైతులకు మేలు జరుగనుంది. వారు వేసిన పంటలకు బీమా సౌకర్యం అందనుంది. రైతులకు కూడా రుణాలు అందే అవకాశం ఏర్పడుతుంది. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు వేగంగా రుణాలు పంపిణీ చేస్తే నిజామాబాద్ జిల్లాలోని రైతులకు మేలు జరుగనుంది.




## రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగాయి

**● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ**



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

**ఆర్మూర్ :** రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం మంథని గ్రామంలో సోమవారం అంబేద్కర్ సంఘ భవనంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో దళితులపై అధిక సంఖ్యలో దాడులు జరుగుతున్నప్పటికీ డీజీపీ తప్పుడు లెక్కలు చెప్తున్నారు. ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని గ్రామాలలో వీడీసీల దౌర్జన్యాలు పెరిగిపోయాయని ప్రజాస్వామ్యం బద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల సహితం నియంత్రించే స్థాయిలో ఉన్నారన్నారు. మంథనిలో ఇటీవల దళితులకు సాంఘిక బహిష్కరణ విధించడమే ఇందుకు నిదర్శనమన్నారు. వీడీసీలో సాంఘిక బహిష్కరణ విధించిన వెంటనే స్పందించడంలో పోలీసులు జాప్యం చేశారని అన్నారు. వీడీసీలను రద్దు చేయాలని డిమాం టడ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని ఆయన అన్నారు. మంథనిలో దళితులకు సాంఘిక బహిష్కరణ చేసిన వీడీసీ సభ్యులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. అంతకుముందు జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సాందన్న, మాజీ జడ్పీ చైర్మన్ గంట సదానందం, ఉప సర్పంచ్ మెట్టు సంతోష్, ఎమ్మార్పీఎస్ నాయకులు తెడ్డు రవికిరణ్, మైలారం బాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమన్వయ సమితీల్లో అధికార పార్టీదే హవా!

**❖ ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టిన నేతలు ❖ మంత్రి పోచారం నేతృత్వంలో ఉభయ జిల్లాల్లో నియామకాలు**

(ఆంధ్రజ్యోతి - నిజామాబాద్)

గ్రామాల్లో అధికార పార్టీ హవా కొనసాగనుంది. రైతు సమన్వయ సమితిలలో నామినేటెడ్ కావడంతో వారిదే నడవనుంది. అధికార పార్టీ సానుభూతి రైతులకే అవకాశం పెరగనుంది. మండల, జిల్లా కమిటీలలో పార్టీ నేతలకే కీలక బాధ్యతలు రానున్నాయి. పార్టీలో ఉన్నవారందరిలో ఎక్కువ మంది రైతులే ఉండటంతో వారికి అవకాశం రానుంది. భవిష్యత్తులో ఈ పదవులే కీలకం కానున్నాయి. మంత్రి పోచారం నేతృత్వంలో జరిగే ఈ నామినేటెడ్ కార్యక్రమాల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కీలకం కానున్నారు. వారి ఆధ్వర్యంలోనే ఈ సమితుల నియామకాలు కానున్నాయి. జిల్లా కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరించే ఈ నియామకాల్లో వ్యవసాయ అధికారి సహాయకులుగా ఉండనున్నారు. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు యంత్రాంగం కసరత్తు చేయనుంది. మంత్రి ఆధ్వర్యంలో జరిగే సమావేశం అనంతరం ఈ రైతుసమన్వయ సమితులను నియమించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 9లోపు రైతుసమన్వయ సమితులకు రైతులను నామినేటెడ్ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్ర మంత్రులను ఆయా జిల్లాలకు ఇన్‌చార్జిలుగా నియమించింది. నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ఆదేశాల్లో పేర్కొంది. గ్రామ, మండల, జిల్లా సమితులకు ఎంతెంత మంది ఉండాలో ఆ ఉత్తర్వులో పేర్కొంది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలో సుమారు 785 గ్రామాలకు పైగా ఉన్నాయి. వీటితో పాటు ఆమ్లెట్ గ్రామాలు ఉన్నాయి. ఉభయ జిల్లాల పరిధిలో 4.3లక్షలకు పైగా రైతులు ఉన్నారు. వీరికి వచ్చే సంవత్సరం ఖరీఫ్ నుంచి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందనున్నాయి. వాటికోసం ఇప్పటి నుంచే ఈ సమితుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ సమితుల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన కీలక పథకాలను అమలు చేయనున్నారు. వచ్చే ఖరీఫ్ నుంచి ప్రతీ ఎకరాకు 4వేల రూపాయల ప్రోత్సాహాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది. రబీలో కూడా మరో రూ. 4వేలు అందించనుంది. ప్రతీ రైతుకు ఈ ప్రోత్సాహకాలు అందించేందుకు అన్ని గ్రామాల్లో గ్రామ రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తోంది. ఈ సమితులలో ప్రతీ గ్రామంలో 15 మందిని నామినేట్ చేస్తారు. వీరిలో మూడో వంతు మహిళలను నియమిస్తారు. ఈ సమితులలో అన్ని కులాలకు ప్రాధాన్యత కల్పిస్తారు. మండల రైతు సమన్వయ సమితిలో 24 మంది, జిల్లా సమన్వయ సమితిలో 24 మందికి అవకాశం కల్పిస్తారు. ఈ రైతు సమన్వయ సమితికి నామినేటెడ్ అయ్యే వారికి తప్పనిసరి భూమి ఉండాలి. అతని పేరుమీద పట్టా ఉండాలి. వారినే నియమించాలనే నిబంధన ఉంది. జిల్లా మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ రెండు జిల్లాల్లో నియామకం చేయనున్నారు. ఉభయ జిల్లాల పరిధిలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం మినహా నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, బోధన్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో ఈ రైతు సమన్వయ సమితీలకు సభ్యులను నామినేటెడ్ చేస్తారు. అర్బన్ నియోజకవర్గం పరిధిలో గ్రామాలు లేనందున ఇక్కడ సమితులకు అవకాశం లేదు. ఈ సమితులకు ఎంపికైన వారిని మండల స్థాయిలో నామినేటెడ్ చేస్తారు. జిల్లా సమితిలోనూ అవకాశం కల్పిస్తారు. ఈ రెండు జిల్లాల పరిధిలో ఇప్పటి వరకు అన్ని పదవుల్లోను అధికార పార్టీ టీఆర్ఎస్సే ఉంది. ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలకు గ్రామస్థాయిలో కొంతమంది ప్రజాప్రతినిధులు ఉన్నారు. తర్వాత వారిలో కొంతమంది అధికార పార్టీలో చేరారు. ఇప్పటికి కూడా కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలకు కొద్దిస్థాయిలో ప్రజాప్రతినిధులు ఉన్నారు. ప్రస్తుతం అధికార పార్టీ నేతలే ఆయా గ్రామాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ గ్రామ రైతు సమన్వయ సమితులు కీలకం కానున్నాయి. ఈ సమితులకు అధికారికంగా సభ్యులను ప్రభుత్వం నామినేటెడ్ చేస్తోంది. వీరి ఆధ్వర్యంలోనే కీలక పథకాలు అమలు కానున్నాయి. రాష్ట్రస్థాయిలో 500 కోట్ల రూపాయలను అ సమితుల కోసం ప్రభుత్వం కేటాయించింది. వ్యవసాయాన్ని ఆధునీకంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేయనుంది. వచ్చే ఏడాది నుంచి ఈ సమితుల ద్వారానే అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రైతులకు రెండు పంటలకు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కూడా ఈ సమితుల ద్వారానే కల్పించేందుకు ఏర్పాట్లను చేస్తోంది. ప్రస్తుతం అధికార పార్టీలో చాలా మంది నేతలు పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. కొంతమందికి రాష్ట్ర, జిల్లా స్థాయిలలో పదవులు వచ్చాయి. మరికొంత మంది నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలో పనిచేస్తున్న నేతలకు ఈ గ్రామ రైతు సమన్వయ సమితులు వరంగా మారనున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లా మంత్రి నేతృత్వంలో జరిగే నామినేటెడ్ నియామకాల కోసం అధికార పార్టీకి చెందిన గ్రామ, మండల స్థాయి నేతలు ఎదురుచూస్తున్నారు. ఎలాగైనా నామినేటెడ్ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. 9లోపే సభ్యులను నియమించనున్నారు. ఈ నామినేటెడ్ సభ్యుల నియామకాలపై ఒకటి రెండు రోజుల్లో మంత్రి ఆధ్వర్యంలో రెండు జిల్లాల పరిధిలో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత గ్రామస్థాయిలో ఈ రైతు సమన్వయ సమితీలకు నామినేటెడ్ చేస్తారు. రాబోయే రోజుల్లో కీలకం కావడంతో ఇప్పటి నుంచే సమితీలో ఉంటే గ్రామ స్థాయిలో పని చేసే అవకాశం ఉంటుందని కొంతమంది నేతలు తెలిపారు. మహిళా రైతులకు కూడా అవకాశాలు రానున్నాయి. సమితుల నియామకాలు మాత్రం పారదర్శకంగా గ్రామాల్లోని అన్ని వర్గాలకు అవకాశం వస్తుందని అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి క్లారిటీ వస్తుందని వారు తెలిపారు.

# దినఫలాలు

**అదృష్టసంఖ్యలు : 2, 9**

సప్న 70 ఎంఎం ఎ/సి - అబిడ్స్ 11.15,2.15,6.00,9.00
గెలాక్సి 70 ఎ/సి - టోలిచౌకి 11.00,2.00,6.00,9.00
శ్రీనివాస 70 ఎ/సి - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00
నర్తకి 70 ఎంఎం ఎ/సి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30
ఆరాధన 70 ఎ/సి - తార్నాక 11.00,2.00,6.00,9.00
స్వప్న 70 ఎంఎం ఎ/సి - కాటేదాన్ 11.15,6.00
కళ్యాణి 70 ఎ/సి - బోయిన్‌పల్లి 11.00,2.00,6.00,9.00
శ్రీకృష్ణ ఎ/సి - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
శారదా 70 ఎంఎం ఎ/సి - కాప్రా 11.00,2.00
మెట్రో 70 ఎంఎం ఎ/సి - బహదూర్‌పుర 11.00,2.00

| | | |
|---|---|---|
| కిషోర్ ఎ/సి - సూర్యాపేట్ | రఘు పిక్చర్ ప్యాలెస్ - చర్ల | శివే 70 ఎ/సి - గంగావతి |
| కిన్నెరసాని - ఖమ్మం | వెంకటేశ్వర - తొర్రూర్ | కూడలిసంఘమేశ్వర - సింధనూర్ |
| సాయికృష్ణ ఎ/సి - కోదాడ | సినీమ్యాక్స్ - జహీరాబాద్ | అపర్ణ 70 ఎ/సి - మాన్వి |
| శాంతి ఎ/సి - కామారెడ్డి | శ్రీనివాస ఎ/సి - తాండూర్ | శ్రీలక్ష్మి 70 ఎ/సి - డోర్నకల్ |
| రాఘవేంద్ర ఎ/సి - జడ్చర్ల | అశోకా - నిజామాబాద్ | సువర్ణ - నారాయణ్‌ఖేడ్ |
| శాంతి ఎ/సి - మర్రిపెడ | రామకృష్ణ - నాగర్‌కర్నూల్ | లక్ష్మి - మహబూబాబాద్ |
| సాయికృష్ణ ఎ/సి - పరిగి | రాజశ్రీ ఎ/సి - రాయకల్ | కృష్ణ టాకీస్ - సత్తుపల్లి |
| వెంకటేశ్వర - తిరుమలగిరి | పద్మనాభ - రాయచూర్ | |

## జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తే కేసులు: ఎస్సై

**మద్నూర్:** మండల కేంద్రం గుండా ఉన్నటువంటి జాతీయ రహదారిపై రాస్తారోకో చేసేవారు పోలీస్ వారి పర్మిషన్ తీసుకోవాలని లేదంటే కేసులు తప్పవని ఎస్సై కాశీనాథ్ హెచ్చరించారు. బాధితులు ఏ పార్టీ వారైన తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సమస్య పరిష్కారం కానట్లయితే పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు పెట్టి పర్మిషన్ ఉన్నట్లయితే రాస్తారోకో చేయాలని సూచించారు. ఎటువంటి సమస్యనైనా శాంతియుతంగా ఎవరికి ఇబ్బందులు కలగకుండా ఉండాలని ఎస్సై సూచించారు. జాతీయ రహదారిపై వెళ్తున్న వారికి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉంటుందని ఆయన గుర్తు చేశారు.

## ఇంటర్వ్యూ

### బిల్లులను సకాలంలో మంజూరు చేస్తున్నాం



జగదీష్, ఎస్టీవో, బాన్సువాడ

**ఆంధ్రజ్యోతి:** బిల్లులను సకాలంలో మంజూరు చేస్తున్నారా ?

**ఎస్టీవో:** ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల, ఇతర బిల్లులను సకాలంలో మంజూరు చేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** వేతన బిల్లులను ఎప్పటి నుంచి ఎప్పటి వరకు కార్యాలయంలో అందజేయాలి?

**ఎస్టీవో:** ఉద్యోగులు తమకు సంబంధించిన వేతన బిల్లులను ప్రతీ నెల 20నుంచి 25వ తేదీ వరకు కార్యాలయంలో అందజేయాలి.

**ఆంధ్రజ్యోతి:** బిల్లుల మంజూరులో కాసులు ముట్టనిదే పనులు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మీ సమాధానం?

**ఎస్టీవో:** అలాంటి ఆరోపణలు అవాస్తవం. బిల్లుల మంజూరులో పారదర్శకంగా ఉంటు, అవినీతికి తావు లేకుండా మంజూరు చేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** బిల్లులను దేని ఆధారంగా మంజూరు చేయడం జరుగుతుంది?

**ఎస్టీవో:** బిల్లులను రాష్ట్ర ఆర్థికశాఖ కేటాయించే బడ్జెట్ కేటాయింపుల ఆధారంగా మంజూరు చేయడం జరుగుతుంది.

## లెన్స్ స్టోరీ

### అధ్వానంగా పరిసరాలు



పాఠశాల ముందు బురద ఇలా..

బాన్సువాడ పట్టణంలోని పోలీస్‌లైన్‌లో గల బాలికల ప్రాథమిక పాఠశాల ముందు వర్షం కారణంగా బురదమయంగా తయారైంది. దీంతో విద్యార్థులకు పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసినప్పుడల్ల పాఠశాలకు వెళ్లాలంటే గెంతుతు వెళ్లాల్సిన దుస్థితి దాపురిస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

(-బాన్సువాడటౌన్)

# నిమజ్జనం ఎట్లా చేసేది గణేశా?

● బురదమయంగా మారిన కల్కి చెరువు కట్ట పరిసరాలు ● ముందస్తు చర్యలు చేస్తే తప్పా నిమజ్జనం సాఫీగా జరగదు

**బాన్సువాడ టౌన్:** 25న వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వినాయక విగ్రహాల ప్రతిష్టాపన నుంచి నిర్వాహకులు 11రోజుల పాటు మండపాలలో వినాయకునికి నిత్య పూజలు చేస్తారు. అనంతరం భారీ ఊరేగింపు మధ్య నిమజ్జనోత్సవాన్ని చేపడుతారు. బాన్సువాడ పట్టణంలో ప్రతియేడాది వినాయక నిమజ్జనం కోసం కల్కి చెరువు, పెద్దపూల్ వద్ద అధికారులు ఏర్పాట్లను చేస్తారు. విగ్రహాల నిమజ్జనం కోసం రాత్రింబవళ్లు అధికారులు దగ్గరుండి ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటారు. ఈ ఏడాది కల్కి చెరువుకట్టపై మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే కట్టమీద నిర్మాణ పనులు జరుగుతుండడంతో కట్టపైకి వెళ్లే దారి పూర్తిగా అధ్వానంగా మారింది. మరో వారంరోజుల్లో నిమజ్జనం జరుగనున్న తరుణంలో అధికారులు కట్టపైకి వెళ్లే దారిలో మొరం వేయించారు. కాగా గత రాత్రి కురిసిన వర్షం కారణంగా ఆ దారి మొత్తం బురదమయంగా మారింది. కనీసం ద్విచక్ర వాహనం కూడా సక్రమంగా వెళ్లే పరిస్తితి లేదు. ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకే దారి కష్టంగా ఉందని మరీ ట్రాక్టర్‌లు ఏవిధంగా వెళ్తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిమజ్జనోత్సవానికి భారీ ఏర్పాట్లలో భాగంగా కట్టమీద లైట్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ కట్టమీద స్థంబాలు కూడా లేకపోవడంతో అధికారులు లైట్లు ఎలా అమర్చాలో అనే సంశయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏది ఏమైనా అధికారులు వారం రోజుల ముందు నిమజ్జనోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తే కానీ పనులు చకచక సాగవని మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రదేశం ఇలా..

## 'సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి'

**బీర్కూర్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, జీపీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో చాంబర్‌లో ఎంపీడీవో భరత్‌కుమార్‌కు సామూహికసెలవు పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సావిత్రమ్మ, ముజామిల్, సారిక, జిపి కార్యదర్శులు సునీత, సౌందర్య, వనజ, తదితరులు పాల్గొన్నారు.

**బాన్సువాడ మండలంలో..**

**బాన్సువాడ:** సెప్టెంబర్ 1న సామూహిక సెలవులు మంజూరు చేయాలని కోరుతు సోమవారం బాన్సువాడ తహసీల్ కార్యాలయంలో వీఆర్వోలు తహసీల్దార్ సి.హెచ్ గోపికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్వో జేఏసి నాయకుడు సాయిబాబా మాట్లాడుతు రాష్ట్రంలో కంట్రీబ్యూటరీ పెన్షన్ విధానం వల్ల 1లక్ష 20వేల 571మంది ఉద్యోగులకు సామూహిక భద్రత లోపించిందని వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల వినూత్న నిరసన

**బాన్సువాడ టౌన్:** బాన్సువాడ-నిజామాబాద్ రూట్‌లో సింగిల్ క్రూ ఓటి డ్యూటీలుగా మార్చిన ఎక్స్‌ప్రెస్ సర్వీసులను యథావిధిగా స్పెషల్‌ఆఫ్ సర్వీసులుగా నడపాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలో భాగంగా సోమవారం ఆర్టీసీ డిపో ముందు ఏర్పాటు చేసిన శిబిరంలో మోకాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. అనంతరం కార్మికులంతా కలిసి డిపో ముందు మధ్యాహ్న భోజన సమయంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యునియన్ నాయకుడు గిరి మాట్లాడుతు యాజమాన్యం కార్మికులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం దిగి వచ్చేవరకు రిలే దీక్షలు యథాతథంగా కొనసాగిస్తామని ఆయన తేల్చి చెప్పారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆమరణ నిరాహారదీక్షకు కూడా పూనుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



మోకాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

## హమ్మయ్యా.. ట్రాఫిక్ క్లియర్




ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న పోలీసు సిబ్బంది

**బాన్సువాడ టౌన్:** పట్టణంలోని పాత బాన్సువాడ వెళ్లే దారి నిత్యం సాయం సమయంలో రద్దీగా ఉండేది. ఈ విషయమ్మై ఆంధ్రజ్యోతి మినీలో ఆదివారం "బాన్సువాడా కా సుల్తాన్ బజార్" అనే శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన పోలీస్ అధికారులు ట్రాఫిక్ నియంత్రణ కోసం గట్టి చర్యలు చేపడుతున్నారు. రక్షక్ వాహనాన్ని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ట్రాఫిక్ క్లియర్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. పాతబాన్సువాడ వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ క్లియర్ కావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే దిశగా కృషిచేసిన ఆంధ్రజ్యోతికి ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రోడ్డు పనులను వేగవంతం చేయాలి

● రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



రోడ్డు పనులను పరశీలిస్తున్న మంత్రి పోచారం

**బాన్సువాడ:** పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను వేగవంతంగా చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. సోమవారం పట్టణంలోని అంగడిబజార్, షాదిఖానా వద్ద కొనసాగుతున్న డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతు పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, కాంట్రాక్టర్ అందుబాటులో ఉండి అధికారులతో కలిసి పక్కా ప్రణాళిక ప్రకారం విస్తరణ పనులను చేపట్టాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్‌నార్ల సురేష్, సొసైటి చైర్మెన్ ఎర్వల కృష్ణారెడ్డి, నాయకులు దుద్దాల అంజిరెడ్డి, జంగం గంగాధర్, ఎజాజ్, కాలువ శ్యామ్, ఆర్డీవో రాజేశ్వర్ , ఏఈ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## వైశ్యసంఘంలో వినాయకునికి మహిళల ప్రత్యేక పూజలు

**బీర్కూర్:** మండల కేంద్రంలోని వైశ్యసంఘంలో వైశ్య సోదరులు వినాయక చవితి పర్వదినాన వినాయకుడిని ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా సోమవారం మండల కేంద్రంలోని వైశ్య మహిళలు సంఘానికి చేరుకుని వినాయకునికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. విష్ణుసహస్రనామాలు, లక్ష్మీ చాలీసా, విగ్రహాల సహస్రనామాలు, సామూహిక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైశ్యసంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

## టీకాలను పరిశీలించిన జిల్లా వైద్యాధికారి



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**బాన్సువాడ:** ప్రభుత్వం తట్టు, రూబెల్లా వ్యాక్సిన్ పంపిణి కార్యక్రమంలో భాగంగా సోమవారం బాన్సువాడ మండలంలోని మోడల్ పాఠశాలలో అందజేస్తున్న రూబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ పరిశీలించారు. హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, తిర్మాలాపూర్ పాఠశాలలో రూబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ వ్యాక్సిన్ అందజేతను ఆయన పరిశీలించారు. 9నెలల నుండి 15సంవత్సరాల పిల్లలందరికీ రూబెల్లా వ్యాక్సిన్ అందజేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## మద్నూర్ మండంలో రుబెల్లా టీకాల కార్యక్రమం

**మద్నూర్:** తట్టు, పొంగు వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు రూబెల్లా టీకాలు వేస్తున్నట్లు తహశీల్దార్ ధన్‌వాల్ సూచించారు. మండలంలోని ధోతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది టీకాలు వేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రూబెల్లా టీకాల వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని 9 నెలలు వయస్సు నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు ఈ టీకాలు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంజయ్, మండల వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఇంటర్వ్యూ**

## విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం



జి. మోహన్‌రెడి,హెచ్‌ఎం,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దఎడ్గి

**ఆంధ్రజ్యోతి:** పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు?
**హెచ్‌ఎం:** పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 198 మంది విద్యార్థులు ఉన్నారు.
**ఆంధ్రజ్యోతి:** గత ఏడాది 10వ తరగతిలో ఎంత శాతం ఉత్తీర్ణత సాధించారు?
**హెచ్‌ఎం:** గత ఏడాది 10వ తరగతిలో 97.5 శాతం ఉత్తీర్ణత సాధించాం
**ఆంధ్రజ్యోతి:** ఈ ఏడాది 10 వ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?
**హెచ్‌ఎం:** 100శాతం ఉత్తీర్ణత సాధించడం కోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది 100శాతం ఉత్తీర్ణత సాధిస్తాం.
**ఆంధ్రజ్యోతి:** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా?
**హెచ్‌ఎం:** మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. విద్యార్థులకు వారానికి మూడుసార్లు గుడ్లు అందిస్తున్నాం.

**లెన్స్ స్టోరీ**

## వసతి గృహంలో విద్యార్థులే పని మనుషులు



హాస్టల్‌లో ఊడుస్తున్న విద్యార్థులు

జుక్కల బీసీ బాలికల హాస్టల్‌లో విద్యార్థులే పని మనుషులు అయి హాస్టల్ ఆవరణలో చీపిరి పట్టి ఊడుస్తున్నారు. హాస్టల్ పని మనుషులు మాత్రము అక్కడే కూర్చుంటున్నారు. హాస్టల్ వార్డెన్ ఇన్‌చార్జి కావడంతో హాస్టల్ సిబ్బంది ఇష్టానురాజ్యంగా వారితో పనులు చేయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పంధించాలని విద్యార్థులు కోరుతున్నారు.

(-జుక్కల్ )

# నత్తనడకన మిషన్ భగీరథ పనులు

**జుక్కల్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇంటింటా శుద్ధమైన తాగునీరు అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ వాటర్‌ట్యాంకు పనులు నత్తనడకగా కొనసాగుతున్నాయి. మండలంలోని 21గ్రామాలకు చెందిన ప్రజలకు పైపుల ద్వారా ఇంటింటికి శుద్ధమైన తాగునీరు సరఫరా కోసం దోసుపల్లి శివారులో 20మీటర్ల ఎత్తులోని 90వేల లీటర్ల సామర్థ్యం గల మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు రూ. 80లక్షల నిధులతో జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2017 డిసెంబర్ 31నాటికి ఇంటింటా కుళాయి ఏర్పాటుచేసి 100లీటర్లు శుద్ధమైన తాగునీరు అందించేందుకు లక్ష్యం పెట్టుకుంది. ఐదుచోట్ల నీటి స్టోరేజీ కోసం నీటిట్యాంకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు కింద 21గ్రామాల ప్రజలకు తాగునీటి అందించేందుకు పైపులైను పనులు కోసం తవ్వకాలు జరుగుతున్నాయి. పైపులైను పనులు సైతం జరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు లక్ష్యం ఒక్కటే ప్రతి ఇంటింటా కుళాయి ఏర్పాటు చేసి శుద్ధమైన నీరు ప్రతి వ్యక్తికి 100 లీటర్లు అందించాలనీ ఆయన కోరిక. శుద్ధమైన నీరు అందించేందుకు డిసెంబర్ 31లోపు ఇంటింటా కుళాయి ఉండాలని, కానీ కొన్ని గ్రామాల్లో పైపులైను పనులు పూర్తి కాలేదని గ్రామస్థులు అంటున్నారు. కేసీఆర్ లక్ష్యం ఏమిటో గానీ జిల్లాకు మారుమూల ప్రాంతం పై అధికారులు దృష్టి సాధించడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్‌ల నిర్లక్ష్యమా? సంబంధించిన అధికారులు పట్టించుకోకపోవటమా? ఎవరిది ఈ నిర్లక్ష్యం అని గ్రామాల ప్రజలు అంటున్నారు.

జర దేఖో!!



దోస్‌పల్లి శివారులో నిర్మాణ పనులు ఇలా..

# మద్నూర్‌లో తహసీల్దార్ అందుబాటులో లేక ఇబ్బందులు

● విద్యార్థుల సర్టిఫికేట్లకు తిప్పలు ● పెండింగ్‌లో కల్యాణలక్ష్మి దరఖాస్తులు

**మద్నూర్:** మండలంలో తహసీల్దార్ ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారుల ఫైలు పెండింగ్ పడుతున్నాయని మండల టీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు ధరాస్‌సాయిలు ఆరోపించారు. ఆయన సోమవారం మద్నూర్‌లో విలేఖరులతో మాట్లాడారు. గత వారంరోజుల నుంచి తహసీల్దార్ ప్రజలకు అందుబాటులో లేరని ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఉండకుండా నిత్యం బాన్సువాడ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. సమయపాలన పాటించడం లేదని ఆరోపించారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులకు సకాలంలో కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందడం లేదని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తుదారులు నిత్యం ఆయన సంతకాల కోసం కార్యాలయం చుట్టు తిరుగుతున్నారని అన్నారు. జిల్లా అధికారులు స్పందించి తహసీల్దార్ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



తాగునీటి కోసం ఫిర్యాదు చేస్తున్న బిచ్కుంద గ్రామప్రజలు

**తాగునీటి కోసం ప్రజవాణిలో ఫిర్యాదు**

**బిచ్కుంద:** మండలకేంద్రానికి ఇరవై రోజులుగా పుల్కల్ మంజీరా తాగునీటి సరఫరా నిలిచపోవడంతో ప్రజలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణిలో తాగునీటి కోసం ప్రజలు తహసీల్దార్ గోవర్ధన్‌కు ఫిర్యదు చేశారు. ఆయన స్పందించి గోవర్ధన్ తాగునీటి ఇబ్బందులు లేకుండా పుల్కల్ మంజీరా తాగునీరు సరఫరా అయ్యేవిధంగా చూస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

**ప్రజావాణిలో అధికారులు కరువు**

**పిట్లం:** తహసీల్ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం మూడు శాఖల అధికారులలతే రావడం జరిగింది. మండల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా అధికారులు ప్రజావాణి కార్యక్రమం చేపట్టగా పిట్లంలో మండల స్థాయి అధికారులు ప్రజావాణికి గైర్హాజరు కావడంతో ప్రజలు సమస్యలు తీరేనా అని అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పంధించాలని వారు కోరారు. ఫిర్యాదులను తహసీల్దార్ పరిశీలించి పరిష్కరించారు.

## మహిళా సంఘాల అభివృద్ధే దేశాభివృద్ధి: ఏపీఎం

**మద్నూర్:** గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల సభ్యులు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని మండల ఏపీఎం రవీంధర్ అన్నారు. సోమవారం మండల ఐకేపీ కార్యాలయంలో 11వ వార్షిక మహాసభ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏరియా కో-ఆర్డినేటర్ సాయిలు, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు వసంత హాజరై మహిళలకు సూచనలు, సలహాలను అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా సంఘాల ద్వారా మహిళలు స్వశక్తితో తమ కాళ్లపై తాము నిలబడి కుటుంభాన్ని పోషిస్తున్నారని అన్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం అందజేస్తున్న రుణాలతో అభివృద్ధి చెందుతున్నారని గుర్తు చేశారు. మహిళ సంఘాల సభ్యులకు ప్రభుత్వం రివాల్వింగ్‌ఫండ్, వారి పిల్లలకు స్కాలర్‌షిపులు అందజేస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బస్వరాజ్‌పటేల్, బాబుపటేల్ తదితరులున్నారు

# క్రీడలు ప్రతీ విద్యార్థికి అవసరం: ఆర్డీవో

**నిజాంసాగర్:** ప్రతీ విద్యార్థికి క్రీడలు తప్పనిసరిగా ఆడడం వల్ల మానసిక దారుడ్యానికి ఎంతో అవసరం ఉంటుందని బాన్సువాడ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. సోమవారం నిజాంసాగర్ మండల కేంద్రంలోని నవోదయ విద్యాలయంలో ప్రాంతీయస్థాయి ఖో ఖో పోటీల ముగింపు కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాంతీయస్థాయి ఖోఖో పోటీలు నిజాంసాగర్‌లో నిర్వహించడం సంతోషకరం అన్నారు. అనంతరం విజేతలకు ఆర్డీవో రాజేశ్వర్, ప్రిన్సిపాల్ శేఖర్‌బాబు, ఆదిలాబాద్ ప్రిన్సిపాల్ చక్రపాణి బహుమతులు అందజేశారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ కరీంనగర్ జట్టు విజయం సాదించింది. అండర్19 బాయ్స్‌లో బీజాపూర్ జట్టు ప్రథమస్థానం, కరీంగర్ ద్వితీయస్థానం సాధించింది. అండర్17 బాలుర విభాగంలో బీజాపూర్ ప్రథమ స్థానంలో, ద్వితియస్థానంలో కరీంనగర్ జట్టు నిలిచింది. అండర్14 బాలుర విభాగంలో కర్నూల్ జట్టు ప్రథమస్థానం, ద్వితీయ స్థానంలో బిజాపూర్ నిలిచింది. అండర్19 బాలికల విభాగంలో కరీంనగర్ ప్రథమస్థానం దక్కించుకోగా, ద్వితీయస్థానం బీజాపూర్ దక్కించుకుందని విద్యాలయ ప్రిన్సిపాల్ శేఖర్ బాబు తెలిపారు. అండర్ 17బాలికల విభాగంలో కరీంనంగర్ ప్రథమస్థానం, ద్వితీయ స్థానం మాండియా, అండర్ 14 బాలికల విభాగంలో కరీంనగర్‌జట్టు ప్రథమస్థానం, ద్వితీయస్థానం బిజాపూర్ దక్కించుకుందని ప్రిన్సిపాల్ తెలిపారు.



బహుమతులు ప్రధానం చేస్తున్న ఆర్డీవో

## నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలి

● వైస్ ఎంపీపీ నర్సాగౌడ్

**పిట్లం:** మండలంలో నిరక్షరాస్యులను సాక్షర భారత్ గ్రామ కో-ఆర్డినేటర్లు పూర్తిస్థాయిలో అక్షరాస్యులుగా మార్చాలని వైస్ ఎంపీపీ నర్సాగౌడ్ అన్నారు. ఆయన సోమవారం మండల పరిషత్ కార్యలయంలో సాక్షర భారత్ నెల వారి సమావేశంలో మాట్లాడుతు గ్రామాలలో మహిళలు, వృద్ధులు వారి సంతకాలు వచ్చే విధంగా కో-ఆర్డినేటర్లు బోధన కొనసాగించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ప్రజలకు అవగాహాన కల్పించాలని ప్రతి కేంద్ర కార్యకర్త సమయపాలన పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పర్బన్న, సాక్షర భారతి ఎంసీవో రవిగౌడ్, గ్రామ కో-ఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

## సాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 7093 క్యూసెక్కుల వరదనీరు

**నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అయిన సింగూరు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాలనుండి 7093 క్యూసెక్కుల వరదనీరు వస్తుంది. సోమవారం నాటికి సింగూరుప్రాజెక్టులో 525.600 మీటర్లకు గాను 521.625 మీటర్ల నీటి సామర్థ్యానికి చేరుకుని 20.33 టీఎంసీలకు చేరుకుంది. సింగూరు ప్రాజెక్టులో క్రమేనా నీటి నిల్వలు పెరుగుతునే ఉన్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి వాగులు, వంకల ద్వారా 1165 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో ప్రాజె క్టు నీటిమట్టం 1405 అడుగులకు గాను1385.42 అడుగుల నీటి సామర్థ్యానికి చేరుకుంది. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 2.483 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కళ్యాణి, సింగితం రిజర్వాయర్లలోనికి ఎగువ ప్రాంతాల నుండి 610క్యూసెక్కుల వరదనీరు వస్తు ఉండడంతో ఈ రిజర్వాయర్ల వరద గేట్లను ఎత్తి నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి నీటిని మళ్లిస్తున్నారు. సింగూరు ప్రాజెక్టులో క్రమేపానా నీటినిల్వలు పెరుగుతుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ప్రభుత్వం ఒప్పందం ప్రకారం విడుదల చేయాల్సిన నీటి విడుదల కోసం జిల్లా రైతాంగం ఎదురుచూస్తూనే ఉంది. ఇదిలా ఉండగా నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఇప్పటికే రైతులు వరి నాట్లు వేసుకున్నారు.



నిజాంసాగర్‌లోని నీటిమట్టం

# The new Chairman of Railway Board?

## Current Affairs & GK



A. Ravi Prakash Reddy
Senior Faculty

1. **Who is the winner of World Food Prize for 2017?**
1) David Grossman
2) Alvin Carl Plantinga
3) Yves Meyer 4) Akinwumi Adesina
5) None of these

2. **Find the correct statement?**
1) Ram Nath Kovind is the 14th President of India, assumed office on 25 July 2017.
2) Venkaiah Naidu is the 13th Vice-President of India, assumed office on 11 August 2017.
3) Justice Dipak Mishra is the 45th Chief Justice of India, assumed office on 28 July 2017.
4) Achal Kumar Jyoti is the 21st Chief Election Commissioner of India, assumed office on 6 July 2017. 5) All of the above

3. **Shanghai Cooperation Organisation (SCO) summit 2017 was held in Astana, Kazakhstan. Who is the President of Kazakhstan?**
1) Nursultan Nazarbayev
2) Almazbek Atambayev
3) Emomali Rahmon
4) Shavkat Mirziyoyev 5) None of these

4. **International Day Against Drug Abuse and Illicit Trafficking is observed on…**
1) June 26 2) July 26 3) August 26
4) September 26 5) October 26

5. **Which state government has launched an exclusive 24×7 helpline '181' for women?**
1) Andhra Pradesh 2) Karnataka
3) Kerala 4) Tamil Nadu 5) Telangana

6. **Which state chief minister has been chosen for the National Agriculture Leadership Award-2017 by the Indian Council of Food and Agriculture (ICFA) under the chairmanship of well known agriculture scientist Prof.M.S. Swaminathan?**
1) Uttar Pradesh 2) Madhya Pradesh
3) Telangana 4) Maharashtra
5) Andhra Pradesh

7. **The ONGC board recently approved the acquisition (51.11% equity stake) of which of the following public sector companies?**
1) IOC 2) BPCL 3) HPCL 4) OIL 5) None

8. **Who is the author of the book "I am HIV positive, so what"?**
1) Ch.Pradip Kumar Singh
2) Jayanta Kalita 3) Arundhati Roy
4) Chetan Bhagat 5) Salman Rushdie

9. **At present the number of Regional Rural Banks (RRBs) in India?**
1) 36 2) 46 3) 56 4) 66 5) None of these

10. **The winners of Rajiv Gandhi Khel Ratna Award for 2017?**
1) Viswanathan Anand and Karnam Malleswari
2) Sachin Tendulkar and Mahendra Singh Dhoni
3) P.V.Sindhu and Dipa Karmakar
4) Jitu Rai and Sakshi Malik
5) Devendra Jhajharia and Sardara Singh

11. **The first regional office of New Development Bank (NDB) was opened in..**
1) Sao Paulo 2) Moscow 3) Mumbai
4) Shanghai 5) Johannesburg

12. **Who is the Pakistan's new High Commissioner to India?**
1) Shahid Khaqan Abbasi
2) Sohail Mahmood
3) Khawaja Muhammad Asif
4) Mamnoon Hussain
5) Khurram Dastgir Khan

13. **The Government of India's Disin vestment Target for 2017-18?**
1) Rs 42,500 crore 2) Rs 52,500 crore
3) Rs 62,500 crore 4) Rs 72,500 crore
5) None of these

14. **The Andhra Pradesh Grameena Vikas Bank(APGVB) is a regional rural bank sponsored by….**
1) State Bank of India 2) Andhra Bank
3) Syndicate Bank 4) Indian Bank
5) None of these

15. **Which of the following countries is NOT a member of G7 group?**
1) Germany 2) Britain 3) France
4) Italy 5) Sweden

16. **Who is the winner of Men's Singles in 2017 Rogers Cup?**
1) Alexander Zverev 2) Roger Federer
3) Pierre-Hugues Herbert
4) Nicolas Mahut 5) None of these

## FOR ALL COMPETITIVE EXAMS

17. **Match the following?**

| Summit | Hosting Place |
|---|---|
| A. G7 Summit 2017 | (i) Taormina, Italy |
| B. G20 Summit 2017 | (ii) Hamburg, Germany |
| C. SCO Summit 2017 | (iii) Astana, Kazakhstan |
| D. APEC Summit 2017 | (iv) Da Nang, Vietnam |
| E. BRICS Summit 2017 | (v) Xiamen, China |

| | A | B | C | D | E |
|---|---|---|---|---|---|
| 1) | (ii) | (iii) | (iv) | (v) | (i) |
| 2) | (v) | (i) | (iii) | (ii) | (iv) |
| 3) | (iv) | (ii) | (i) | (v) | (iii) |
| 4) | (iii) | (iv) | (ii) | (i) | (v) |
| 5) | (i) | (ii) | (iii) | (iv) | (v) |

18. **Which city will host the Summer Olympics in 2028?**
1) Rio de Janeiro 2) Tokyo 3) Paris
4) Los Angeles 5) None of these

19. **Who is Hun Sen?**
1) The Prime Minister of Singapore
2) The Prime Minister of Australia
3) The Prime Minister of Bhutan
4) The Prime Minister of Cambodia
5) The Prime Minister of China

20. **The new Chairman of Railway Board?**
1) Suresh Prabhu 2) Ashwani Lohani
3) K.K.Venugopa 4) Achal Kumar Jyoti
5) Rajiv Kumar

21. **Which of the following is the Super Regulatory Body and the idea to create was first mooted by the Raghuram Rajan Committee on Financial Sector Reforms in 2008?**
1) Reserve Bank of India (RBI)
2) Securities and Exchange Board of India (SEBI)
3) Insurance Regulatory and Development Authority of India (IRDAI)
4) Pension Fund Regulatory and Development Authority (PFRDA)
5) Financial Stability and Development Council (FSDC)

22. **Who occupies top place in the Forbes' list of highest paid female athletes of 2017, with $27 million in earnings between June 2016 and June 2017?**
1) Serena Williams 2) Maria Sharapova
3) Venus Williams 4) Martina Hingis
5) Garbine Muguruza

23. **World's largest Gold consuming country?**
1) China 2) India 3) USA 4) Turkey
5) None of the above

24. **Who resigns as MD & CEO of Infosys?**
1) Vishal Sikka 2) U.B.Pravin Rao
3) Natarajan Chandrasekaran
4) Rajesh Gopinathan 5) None of these

25. **Which of the following statements is correct regarding 2017 Global Retirement Index?**
1) This Index is published by French asset management company Natixis Global.
2) Norway topped the list followed by Switzerland and Iceland.
3) India was ranked last at 43rd position.
4) The index ranks 43 countries on the basis of four factors viz. the material means to live comfortably in retirement (Material Well-being); access to quality health services (Health); access to quality financial services to help preserve savings value and maximize income (Finances) and a clean and safe environment (Quality of Life ).
5) All of the above

26. **Who is the President of Argentina?**
1) Mauricio Macri 2) Michel Temer
3) Raul Castro 4) Michelle Bachelet
5) Enrique Pena Nieto

27. **Which of the following statements is correct about Vice-President of India?**
1) The Vice-President of India (article 63) is the second-highest constitutional office in India after the President of India.
2) The Vice-President of India is also ex officio Chairperson of the Rajya Sabha.
3) The Vice-President is elected indirectly by members of an electoral college consisting of the members of both Houses of Parliament.
4) The Vice-President holds office for five years. 5) All of the above.

28. **As per Census 2011 Final data, India's Literacy Rate?**
1) 72.98% 2) 80.9% 3) 64.6% 4) 94%
5) 61.8%

29. **The day which is celebrated as the Good Governance Day in India is...**
1) 28 February 2) 21 April 3) 29 June
4) 31 October 5) 25 December

30. **Who is the new non-executive Chairman of Infosys?**
1) N.R.Narayana Murthy
2) Nandan Nilekani 3) S. Gopalakrishnan
4) S. D. Shibulal 5) Vishal Sikka

31. **Which of the following novel won the 2017 Man Booker International Prize?**
1) A Horse Walks into a Bar
2) The Vegetarian
3) A Brief History of Seven Killings
4) The Sellout 5) None of the above

32. **The Union government has recently hiked OBC creamy layer ceiling limit to how much for central government jobs?**
1) Rs 6 lakh 2) Rs 8 lakh 3) Rs 10 lakh
4) Rs 12 lakh 5) None of the above

33. **Who is the author of book "I Do What I Do: On Reform, Rhetoric & Resolve"?**
1) Urjit Patel 2) Raghuram Rajan
3) D.Subbarao 4) Y.V.Reddy
5) Bimal Jalan

34. **As per 2017 UNWTO report on least-visited countries, which is the least visited country in 2016?**
1) Tuvalu 2) Kiribati
3) Sao Tome and Principe
4) Montserrat 5) Comoros

35. **As per 2017 UNWTO report on most-visited countries, which is the most visited country in 2016?**
1) France 2) USA 3) Spain
4) China 5) Italy

36. **Who is the new Chairman and Managing Director of Air India?**
1) Rajiv Kumar 2) Rajiv Bansal
3) Shashi Shanker 4) Ashwani Lohani
5) None of the above

37. **The 8th World Renewable Energy Technology Congress summit was held in..**
1) New Delhi 2) Mumbai 3) Kolkata
4) Chennai 5) Bengaluru

38. **Rural Infrastructure Development Fund (RIDF) was set up by the Government in 1995-96 for financing ongoing rural Infrastructure projects. RIDF is maintained by..**
1) RBI 2) SBI 3) NABARD
4) NHB 5) None of these

39. **The current member countries of Asia Pacific Economic Cooperation (APEC)?**
1) 17 2) 19 3) 21 4) 23 5) None of these

40. **Which of the following countries has topped the sustainable development goals (SDGs) index 2017?**
1) Sweden 2) Denmark 3) Finland
4) Norway 5) None of the above

### Answers

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) 4 | 7) 3 | 13) 4 | 19) 4 | 27) 5 | 35) 1 |
| 2) 5 | 8) 2 | 14) 1 | 20) 2 | 28) 1 | 36) 2 |
| 3) 1 | 9) 3 | 15) 5 | 21) 5 | 29) 5 | 37) 1 |
| 4) 1 | 10) 5 | 16) 1 | 22) 1 | 30) 2 | 38) 3 |
| 5) 5 | 11) 5 | 17) 5 | 23) 1 | 31) 1 | 39) 3 |
| 6) 3 | 12) 2 | 18) 4 | 24) 1 | 32) 2 | 40) 1 |
| | | | 25) 5 | 33) 2 | |
| | | | 26) 1 | 34) 1 | |

## స్కాలర్‌షిప్స్

### పోస్ట్ మెట్రిక్ స్కీమ్

మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు పిహెచ్‌డి వరకు అన్ని రకాల ఉన్నత విద్య అభ్యసించడానికి వీలు కల్పిస్తూ వారి ప్రతిభ ఆధారంగా ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన **పోస్ట్ - మెట్రిక్ స్కాలర్‌షిప్ స్కీమ్‌**కు ప్రకటన వెలువడింది. ఈ స్కీమ్‌లో బాలికలకు 30 శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది.

**అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇప్పటివరకు అన్ని తరగతుల్లో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.2 లక్షల లోపు ఉండాలి.

**రివార్డు:** విద్యార్థులు అభ్యసించే కోర్సును అనుసరించి అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు, మెయింటెనెన్స్ ఫీజు చెల్లిస్తారు.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** ఆగస్టు 31

**వెబ్‌సైట్:** www.b4s.in/edge/PMS21

### మెరిట్ కం మీన్స్

**మి**నిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, భారత ప్రభుత్వం ఉమ్మడిగా నిర్వహిస్తున్న **మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్‌**నకు ప్రకటన వెలువడింది. అసమాన ప్రతిభ గల మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఆర్థికంగా తోడ్పాటు నందించేందుకుగాను ఈ స్కాలర్‌షిప్‌ను ఉద్దేశించారు.

**అర్హత:** గుర్తింపు పొందిన కళాశాలల్లో టెక్నికల్ & ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్/ పన్నెండో తరగతి స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.2.5 లక్షలకు మించరాదు

**రివార్డు:** హాస్టల్ విద్యార్థులకు మెయింటెనెన్స్ అలవెన్స్ కింద ఏడాదికి రూ.10,000, డే స్కాలర్స్‌కు రూ.5000 ఇస్తారు. కోర్సు ఫీజు కింద రూ.20,000/ కళాశాల ఫీజు రెంటిలో ఏది తక్కువగా ఉంటే ఆ మొత్తాన్ని చెల్లిస్తారు.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** ఆగస్టు 31

**వెబ్‌సైట్:** www.b4s.in/edge/MCM9

# ఒక పదార్థ అయస్కాంతీకరణ అవధిని ఏమంటారు?

## అయస్కాంతత్వం

1. కిందివాటిలో ఫెర్రో అయస్కాంత పదార్థాలు కానివి ఏవి ?
ఎ) లోహాలు బి) మన
సి) వాయు డి) మిశ్రమ లోహాలు
2. అయస్కాంతం చుట్టూ అయస్కాంతత్వం-----
ఎ) ఏక మితీయం బి) త్రిమితీయం
సి) ద్విమితీయం డి) పైవేవీకావు
3. ఒక సమదైశిక యానకంలో B, $\mu_0$, H, M ల మధ్య ఉన్న సంబంధం?
ఎ) $H = \mu_0[B + M]$ బి) $M = \mu_0[B + H]$
సి) $B = \mu_0[H + M]$ డి) $B - M = \mu_0 H$
4. అయస్కాంత అభివాహాన్ని ఏ ప్రమాణంలో కొలుస్తారు?
ఎ) ఆంపియర్/ మీటర్ బి) ఆంపియర్ - మీటర్
సి) వెబర్ డి) న్యూటన్ - ఆంపియర్ /మీటర్
5. సర్వ సమానాలైన మూడు దండయస్కాంతాలను ఒక త్రిభుజంగా అమర్చారు. ఒక్కోదానికి M అయస్కాంత భ్రామకం ఉంది. ఒక అయస్కాంత ఉత్తర ధృవాన్ని తరవాతి దాని దక్షిణ ధృవంతో కలిసేటట్లుగా అమరిస్తే ఫలిత అయస్కాంత భ్రామకం?
ఎ) 0 బి) $\sqrt{3}$ M సి) 3 M డి) $\sqrt{2}$ M
6. 400 యూనిట్లు అయస్కాంత భ్రామకం ఉన్న ఒక దండయస్కాంతాన్ని రెండు ముక్కలుగా విభజించారు. అయితే ఇపుడు ఒక్కో ముక్క అయస్కాంత భ్రామకం ఎంత?
ఎ) 100 బి) 200 సి) 300 డి) 400
7. ఒక దండయస్కాంతంలో తటస్థ బిందువులు, దాని మధ్య లంబరేఖ మీద లభించాలంటే దాని ఉత్తర ధృవాన్ని ఉంచాల్సిన భూమి ధృవం?
ఎ) ఉత్తరం బి) దక్షిణం సి) తూర్పు డి) పడమర
8. రెండు అయస్కాంత బలరేఖలు--------
ఎ) ఒక చోట కలుసుకోవాలి
బి) ఒకదానినొకటి ఖండించుకోవు
సి) ఎప్పుడూ సమాంతరంగా ఉండాలి
డి) లంబంగా ఉండాలి
9. అయస్కాంత ససెప్టిబిలిటీ ఉష్ణోగ్రత మీదగానీ, అనువర్తిత అయస్కాంత క్షేత్రం మీదగానీ ఆధారపడని పదార్థం?
ఎ) పారా అయస్కాంత బి) ఫెర్రో అయస్కాంత
సి) డయా అయస్కాంత డి) అనయస్కాంత
10. M అయస్కాంత భ్రామకం ఉన్న ఒక దండయస్కాంతాన్ని అర్ధ వృత్తాకారంగా వంచినపుడు దాని అయస్కాంత భ్రామకం-------
ఎ) M/π బి) M/ 2π సి) 4M/π డి) 2M/π
11. అయస్కాంతత్వానికి అసలైన పరీక్ష?
ఎ) వికర్షణ బి) ప్రేరణ
సి) ఆకర్షణ డి) ఏకస్పర్శ
12. ఒక సాధారణ ఇనుప ముక్కలో-----
ఎ) అయస్కాంత ద్వి ధృవాలు ఒక నియమిత దిశలో అమరి ఉంటాయి
బి) అయస్కాంత ద్వి ధృవాలు క్రమరహితంగా అమరి ఉంటాయి
సి) అయస్కాంత ద్వి ధృవాలు ఉండవు
డి) పైవేవీకావు
13. అయస్కాంతీకరణ తీవ్రతకు అయస్కాంతీకరణ క్షేత్ర తీవ్రతకు గల నిష్పత్తి?
ఎ) ప్రవేశ్యశీలత బి) అయస్కాంత తీవ్రత
సి) ససెప్టిబిలిటీ డి) అయస్కాంత ప్రేరణ
14. దండయస్కాంతం మధ్య లంబరేఖ మీద అయస్కాంత ప్రేరణ-----
ఎ) $B = (\mu_0/4\pi)(2M/d^3)$
బి) $B = (\mu_0/2\pi)(M/d^3)$
సి) $B = (\mu_0/2\pi)(2M/d^3)$
డి) $B = (\mu_0/4\pi)(M/d^3)$
15. లోడ్ స్టోన్స్ అంటే?
ఎ) ఇనుప ఖనిజాలు బి) వజ్రాలు
సి) ఆకర్షణ గల పదార్థాలు డి) బొగ్గు
16. విద్యుదయస్కాంతం తయారు చేయడానికి ఉపయోగించే పదార్థం?
ఎ) మెత్తని ఇనుము బి) గట్టి ఇనుము
సి) నికెల్ డి) పాస్ఫర్ బ్రాంజ్
17. కింది వాటిలో భిన్నంగా ఉన్న పదార్థం?
ఎ) నికెల్ బి) కోబాల్ట్
సి) క్రోమియం డి) ఉక్కు
18. ఆకర్షించే స్వభావం గల ఇనుప ఖనిజం?
ఎ) మాగ్నటైట్ బి) మాగ్నసైట్
సి) హెమటైట్ డి) జేలమైట్
19. శూన్యంలో అయస్కాంత ప్రవేశ్య శీలత($\mu_0$) = ----- హెన్రీ/ మీటర్
ఎ) $4\pi \times 10^{-7}$ బి) $4\pi \times 10^{7}$
సి) $2\pi \times 10^{-7}$ డి) $10^{-7}$
20. ఒక పదార్థ అయస్కాంతీకరణ అవధిని ఏమంటారు?
ఎ) ప్రవేశ్య శీలత బి) అయస్కాంత సంతృప్తత
సి) రిటెంటివిటీ డి) అయస్కాంతత్వం
21. I, V, H ల మధ్య సంబంధం?
ఎ) $H = I + V$ బి) $H^2 = I^2 + V^2$

## పోటీ పరీక్షల ప్రత్యేకం - ఫిజిక్స్

సి) $I^2 = H^2 + V^2$ డి) $V^2 = I^2 + H^2$
22. ఏదైనా ఒక వైశాల్యంలో ఉన్న అయస్కాంత బలరేఖల సంఖ్య------
ఎ) అయస్కాంత ప్రేరణ
బి) అయస్కాంత అభివాహం
సి) అయస్కాంత క్షేత్ర తీవ్రత
డి) అయస్కాంత అభివాహ సాంద్రత
23. ఒక అయస్కాంత ధృవం, మరో అయస్కాంత ధృవాన్ని ఆకర్షించే లేదా వికర్షించే స్వభావాన్ని ఏమంటారు?
ఎ) ధృవసత్వం బి) అయస్కాంతత్వం
సి) అయస్కాంతీకరణం డి) ప్రవేశ్యశీలత
24. ఒక ధృవం నుంచి ఒక మీటర్ దూరంలో ఉన్న మరో సర్వ సమాన ధృవం $10^{-7}$ న్యూటన్ల బలంతో వికర్షిస్తే ఆ ధృవం ధృవసత్వం?
ఎ) $10^{-7}$ ఆంపియర్ - మీటర్
బి) $10^{7}$ ఆంపియర్ - మీటర్
సి) 1 ఆంపియర్ - మీటర్
డి) 1/ $10^{4}$ ఆంపియర్ - మీటర్
25. శూన్యంలో విలోమ వర్గ నియమం------
ఎ) $F = (\mu/4\pi)(m_1\ m_2/r^2)$
బి) $F = (\mu_0/4\pi)(m_1\ m_2/r^2)$
సి) $(4\pi/\mu)(m_1\ m_2/r^2)$
డి) $F = m_1\ m_2/r^2$
26. ఒక ప్రదేశంలోని భూ అయస్కాంత క్షేత్రాన్ని నిర్ణయించే రాశులు
ఎ) భూ అయస్కాంత అయస్కాంత రాశులు
బి) భూ అయస్కాంత మూల రాశులు
సి) భూ అయస్కాంత దిశా రాశులు
డి) భూ అయస్కాంత ఉప రాశులు
27. భూమి లోపల ఊహించిన దండయస్కాంత ఉత్తర ధృవం ఏ భౌగోళిక దిశ వైపు ఉంటుంది?
ఎ) ఉత్తరం బి) దక్షిణం సి) తూర్పు డి) పడమర
28. అయస్కాంతంలో అయస్కాంతత్వం ఎక్కువగా ఉండే ప్రదేశం?
ఎ) ధృవాల వద్ద బి) మధ్యలో
సి) కేంద్రం వద్ద డి) పైవన్నీ
29. అయస్కాంత భ్రామకం ఎస్ఐ ప్రమాణం
ఎ) ఆంపియర్ - మీటర్ బి) ఆంపియర్ / మీటర్
సి) ఆంపియర్ / మీటర్ $^2$
డి) ఆంపియర్ - మీటర్ $^2$
30. ఆంధ్రప్రదేశ్‌లో $B_0$ విలువ?
ఎ) $0.25 \times 10^{-4}$ టెస్లా బి) $0.39 \times 10^{-4}$ టెస్లా
సి) $0.29 \times 10^{-4}$ టెస్లా డి) $0.35 \times 10^{-4}$ టెస్లా
31. కింది వాటిలో యానకం ఆధారపడనిది?
ఎ) అయస్కాంత ప్రేరణ
బి) అయస్కాంత క్షేత్ర తీవ్రత
సి) విలోమ వర్గ నియమం డి) పైవేవీకావు



శీలం దేవేందర్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

32. ధృవసత్వం m, పొడవు 2l గల దండయస్కాంత భ్రామకం M ?
ఎ) m/2l బి) m x 2l
సి) 2l/m డి) 2m/l
33. భౌగోళిక ఉత్తర ధృవాన్ని చూస్తున్న ఒక దండయస్కాంత దక్షిణ ధృవం వల్ల ఏర్పడే తటస్థ బిందువుల సంఖ్య?
ఎ) 1 బి) 3 సి) 2 డి) 4
34. తటస్థ బిందువులు దండయస్కాంత మధ్య బిందువు 'o' నుంచి అక్షీయ రేఖపై 'd' దూరంలో ఉన్నపుడు అయస్కాంత భ్రామకం-----
ఎ) $M = 390\ d^3$ ఆంపియర్ - మీటర్$^2$
బి) $M = 250\ d^3$ ఆంపియర్ - మీటర్$^2$
సి) $M = 210\ d^3$ ఆంపియర్ - మీటర్$^2$
డి) $M = 195\ d^3$ ఆంపియర్ - మీటర్$^2$
35. స్వేచ్ఛగా వేలాడదీసిన దండయస్కాంతం సూచించే దిక్కులు?
ఎ) తూర్పు- పడమర బి) ఉత్తరం - దక్షిణం
సి) ఉత్తరం - తూర్పు డి) దక్షిణం - పడమర
36. 1 టెస్లా = -------గాస్
ఎ) $10^{7}$ బి) $10^{-7}$ సి) $10^{4}$ డి) $10^{-4}$
37. అయస్కాంత వికర్షణకు లోనయ్యే పదార్థాలు?
ఎ) కాపర్ బి) బిస్మత్ సి) ఇనుము డి) ఎ, బి
38. అయస్కాంత ధృవాల ధృవసత్వాలు ఎలా ఉంటాయి?
ఎ) అసమానంగా
బి) కొన్ని సమానంగా, మరికొన్ని అసమానంగా
సి) సమానంగా డి) ఏదీకాదు
39. సాపేక్ష ప్రవేశ్య శీలత ప్రమాణాలు?
ఎ) హెన్రీ/ మీటర్ బి) హెన్రీ మీటర్
సి) ఉండవు డి) ఏదీకాదు
40. ఇనుప కడ్డీని అయస్కాంతంగా మారిస్తే దాని పొడవు?
ఎ) కొద్దిగా పెరుగుతుంది బి) పెరిగి తగ్గుతుంది
సి) కొద్దిగా తగ్గుతుంది డి) మారదు
41. భూమి భౌగోళిక అక్షానికి, అయస్కాంత అక్షానికి మధ్య గల కోణం?
ఎ) అవపాతం బి) దిక్పాతం
సి) అనుపాతం డి) క్షేత్ర తీవ్రత
42. భూ అయస్కాంత క్షేత్రం భూమి ఉపరితలం నుంచి ఎంత ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది?
ఎ) 2,58,000 కి.మీ. బి) 2,85,000 కి.మీ.
సి) 5,28,000 కి.మీ. డి) 8,20,000 కి.మీ.
43. ఒకే అవపాతం గల ప్రాంతాలను కలుపుతూ గీసిన రేఖలను ఏమంటారు?
ఎ) ఐసోబార్లు బి) ఐసోక్లినిక్
సి) ఐసోగోనిక్ డి) ఐసోటోన్
44. పరమ శూన్య ఉష్ణోగ్రతను కొలిచేందుకు ఉపయోగించే అయస్కాంత ఉష్ణోగ్రత మాపకంలో దేనిని వాడతారు?
ఎ) నియాన్ బి) పాదరసం
సి) ద్రవస్థితిలోని హీలియం డి) ఆల్కహాల్
45. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియో మేగ్నటిజం సంస్థ గల ప్రదేశం?
ఎ) బెంగళూరు బి) ముంబై
సి) ఢిల్లీ డి) చెన్నై
46. ఫెర్రైట్స్ అంటే?
ఎ) పారా అయస్కాంత పదార్థాలు
బి) ఫెర్రో అయస్కాంత పదార్థాలు
సి) డయా అయస్కాంత పదార్థాలు డి) ఎ, సి

### సమాధానాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) సి | 9) సి | 17) సి | 25) బి | 34) డి | 43) బి |
| 2) బి | 10) డి | 18) ఎ | 26) బి | 35) బి | 44) సి |
| 3) సి | 11) ఎ | 19) ఎ | 27) బి | 36) సి | 45) బి |
| 4) సి | 12) బి | 20) బి | 28) ఎ | 37) డి | 46) బి |
| 5) ఎ | 13) సి | 21) సి | 29) సి | 38) సి | |
| 6) బి | 14) డి | 22) బి | 30) బి | 39) ఎ | |
| 7) ఎ | 15) సి | 23) ఎ | 31) బి | 40) ఎ | |
| 8) బి | 16) ఎ | 24) సి | 32) బి | 41) బి | |
| | | | 33) సి | 42) సి | |

## ఉద్యోగాలు

### ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్

ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ - **అసిస్టెంట్స్, అసిస్టెంట్ మేనేజర్స్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు:** 264

**అసిస్టెంట్ మేనేజర్**
**ఖాళీలు:** 100 **ట్రైనింగ్ వ్యవధి:** ఏడాది
**అర్హత:** 60 శాతం మార్కులతో ఎంబీఏ ఉత్తీర్ణత + కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి
**వేతనం:** నెలకు రూ.49,805

**అసిస్టెంట్**
**ఖాళీలు:** 164(తెలంగాణకు 5, ఆంధ్రప్రదేశ్‌కు 11 పోస్టులను కేటాయించారు)
**ట్రైనింగ్ వ్యవధి:** ఆరు నెలలు
**అర్హత:** 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత + కంప్యూటర్ స్కిల్ ఉండాలి.
**వయసు:** జులై 1 నాటికి 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
**వేతనం:** నెలకు రూ. 21,236
**ఎంపిక:** ఆన్‌లైన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా
**ఆన్‌లైన్ ఎగ్జామ్‌కు కాల్ లెటర్ డౌన్‌లోడింగ్:** సెప్టెంబరు 26 నుంచి
**ఆన్‌లైన్ ఎగ్జామ్:** అసిస్టెంట్ మేనేజర్‌కు అక్టోబరు 10న, అసిస్టెంట్‌కు అక్టోబరు 12న
**తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం
**దరఖాస్తు ఫీజు:** రూ.500
**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 7
**వెబ్‌సైట్:** www.lichousing.com

### ఇండియన్ కోస్ట్ గార్డ్

ఇండియన్ కోస్ట్ గార్డ్ - **నావిక్ (జనరల్ డ్యూటీ) 10 + 2** ఎంట్రీ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.
**అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్ (మేథ్స్, ఫిజిక్స్) లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన పురుషులు దరఖాస్తుకు అర్హులు.
**వయసు:** 18 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి
**ఎంపిక:** రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా
**పరీక్ష కేంద్రాలు:** తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు సికింద్రాబాద్, విశాఖపట్నం కేంద్రాలను కేటాయించారు.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 4
**వెబ్‌సైట్:** www.joinindiancoastguard.gov.in

### సిఎస్ఐఆర్ - సిఇఇఆర్ఐ

సిఎస్ఐఆర్ - సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఇఇఆర్ఐ) - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**మొత్తం ఖాళీలు:** 20

**సైంటిస్ట్** **ఖాళీలు:** 16
**వయసు:** దరఖాస్తు నాటికి 32 ఏళ్లు మించరాదు
**వేతనం:** రూ.77178

**సీనియర్ సైంటిస్ట్** **ఖాళీలు:** 2
**వయసు:** దరఖాస్తు నాటికి 37 ఏళ్లు మించరాదు
**వేతనం:** రూ.89832

**ప్రిన్సిపల్ సైంటిస్ట్** **ఖాళీలు:** 2
**వయసు:** దరఖాస్తు నాటికి 45 ఏళ్లు మించరాదు
**వేతనం:** రూ.135090
**అర్హత:** సంబంధిత విభాగంలో ఎంఇ/ ఎంటెక్/ పిహెచ్‌డి పూర్తిచేసి ఉండాలి
**ఎంపిక:** అనుభవం, ఇంటర్వ్యూ ద్వారా
**దరఖాస్తు ఫీజు:** రూ.100
ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ఇచ్చిన దరఖాస్తు ఫారం నమూనాను డౌన్‌లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి
**దరఖాస్తు స్వీకరణకు ఆఖరు తేదీ:** సెప్టెంబరు 11
**చిరునామా:** Controller of Administration, CSIR - Central Electronics Engineering Research Institute, Pilani - 333031
**వెబ్‌సైట్:** www.ceeri.res.in

# ఇన్‌చార్జీల పాలన.. ఇంకెన్నాళ్లు ?

● జీపీ కార్యదర్శులు లేక కుంటుపడుతున్న అభివృద్ధి ● పంచాయతీరాజ్ శాఖ మంత్రి స్పందించేనా ?

**కామారెడ్డి రూరల్ :** కామారెడ్డి మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం నలుగురే పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామాల్లో సమస్యలు పెరిగిపోతున్నాయి. గ్రామాల్లో సరైన బాధ్యుడు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామాన్నీ, మండలాన్నీ ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుంది. కానీ గ్రామాలకు కార్యదర్శులు లేక గ్రామాల్లో సమస్యలు తీవ్రమవుతున్నాయి. పారిశుధ్య సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మురికి కాలువల్లో చెత్తాచెదారం పెరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. మురికి కాలువలు, మురికి నీటి గుంతలు ఈగలు, దోమలకు ఆవాసాలుగా మారాయి. దీంతో ప్రజలు రోగాల బారీన పడుతున్నారు. గ్రామానికి ఒక కార్యదర్శి ఉన్నట్లయితే గ్రామాల్లోని సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది. 17 గ్రామ పంచాయతీలకు కేవలం నలుగురే కార్యదర్శులు విధులు నిర్వర్తించడంతో సమస్యలు పరిష్కారం కాకుండా పేరుకుపోతున్నాయి. పైగా అభివృద్ధి పనులు కుంటు పడుతున్నాయి. గ్రామానికి కార్యదర్శి బాధ్యతగా విధులు నిర్వహించినట్లయితే సమస్యలు లేకుండా పోతాయని గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఒక్కో కార్యదర్శికి 6 గ్రామాల వరకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో కార్యదర్శులు ఎలా పక్కాగా విధులు నిర్వహిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నామ్‌కేవాస్తేగా కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నామా.. అంటే నిర్వహిస్తున్నాం.. అన్నట్లుగా కొందరు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామంలో ఏవైన సమస్యలు ఉంటే కార్యదర్శికి విన్నవిద్దామంటే సదరు కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదని వాపోతున్నారు. ప్రతి రోజు తాగు నీటి ట్యాంక్‌ల్లో క్లోరినేషన్ సైతం సక్రమంగా జరగడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషితమైన నీటినే తాగుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యదర్శులను నియమించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

● **జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇంత దారుణమా ?**

జిల్లా కేంద్రంలోని మండలంలో కేవలం నలుగురే పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారంటే కార్యదర్శుల కొరత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అసలే జిల్లా కేంద్రం కావడం, మండలం చుట్టూ బైపాస్ రోడ్డు వెళ్తుండడంతో రోడ్డుకు ఇరువైపులా రియల్ ఎస్టేట్ వెంచర్లు విచ్చలవిడిగా వెలిశాయి. అయితే ఏ ఒక్క వెంచర్‌లోనూ రియల్ వ్యాపారులు కనీస సౌకర్యాలు కల్పించ కుండానే ప్లాట్లుగా చేసి అమాయక వినియోగదారులకు విక్రయిస్తున్నారు. అంతే గాకుండా వెంచర్లలో గ్రామ పంచాయతీకి 10 శాతం ఓపెన్ స్థలాన్ని రిజిష్టర్ చేసి ఇవ్వాలి. అయితే కొంత మంది వ్యాపారులు తమ వెంచర్ పక్కన గల అసైన్డ్, శిఖం భూములను పంచాయతీకి ఓపెన్ స్థలాలుగా సైతం ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి.



సరంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

అయితే వీటిని దగ్గరుండి పరిశీలించాల్సిన పంచాయతీ కార్యదర్శులు లేకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది.

● **323 పంచాయతీలకు 102మంది కార్యదర్శులు**

జిల్లాలో 323 గ్రామ పంచాయతీలు ఉండగా సగానికంటే తక్కువ మంది కార్యదర్శులు ఉన్నారు. జిల్లాలో కేవలం 102 మంది మాత్రమే పంచాయతీ కార్యదర్శులు ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సంవత్సరాలు గడుస్తున్నా పంచాయతీ కార్యదర్శుల నియామకాలు చేపట్టకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి. అంతేగాకుండా ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు కూడా సక్రమంగా ప్రజల దరికి చేయడం లేదనే విమర్శలున్నాయి. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాల్సిన కార్యదర్శులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● **పంచాయతీరాజ్ శాఖ మంత్రి స్పందించేనా ?**

కామారెడ్డి జిల్లా ఏర్పడిన తర్వాత మొదటి సారిగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం జిల్లాకు వస్తున్నందున పంచాయతీ కార్యదర్శుల కొరతను తీరుస్తారని జిల్లా ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న కార్యదర్శులకు కనీసం సగం మంది వరకైనా నియమిస్తే కొంత వరకైనా సమస్య తీరుతుందని సర్పంచ్‌లు పేర్కొంటున్నారు. అంతేగాకుండా ఎంపీటీసీలకు విధులు, నిధులు లేకపోవడంతో వారు సైతం తమ ఆవేదనను మంత్రి దృష్టికి తీసుకువెళ్తే పరిష్కారమవుతాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. మండల పరిషత్‌లతో పాటు గ్రామ పంచాయతీలకు నిధులు లేకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడుతోందని ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ సమస్యలన్నింటిని మంత్రి జూపల్లి పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఖోఖో పోటీల్లో ధర్మారావుపేట్ విద్యార్థులకు బంగారు పతకాలు

**సదాశివనగర్ రూరల్:** మండలంలోని ధర్మారావుపేట్‌కు చెందిన విద్యార్థులు భాస్కర్, నవీన్ జాతియ స్థాయిలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల పీఈటీ అశోక్ తెలిపారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో చెన్నైలో నిర్వహిలచిన అండర్-19 ఖోఖో పోటిల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ విద్యార్థుల రవాణా భత్యం కోసం గ్రామం నుండి రూ.14వేలు అందజేసినట్లు ఆయన తెలిపారు. జాతియస్థాయిలో ధర్మారావుపేట్ పేరును వినిపించిన విద్యార్థులను సర్పంచ్ వాణి బాయివిద్యాధర్‌రావు, ఉపసర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి అభినందించారు.


పతకాలతో భాస్కర్, నవీన్

## సింగీతం రిజర్వాయర్ కాల్వను పరిశీలించిన మంత్రి

**నిజాంసాగర్ :** మండలంలోని మహ్మద్‌నగర్ వద్ద సింగీతం రిజర్వాయర్ కాలువను సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో జలాశయాలు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. వర్షాలు కురవడంతో సింగీతం రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండి మిగులు నీటిని కాలువల ద్వారా నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి మళ్లించడం జరుగుతుందన్నారు. రైతుల పంటలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. ఆయనతో పాటు టీఆర్ఎస్ కార్యకర్తలు,నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.

## నష్టపరిహారం కోసం రైతుల ఆందోళన

**నాగిరెడ్డిపేట:** గత సంవత్సరం భారీ వర్షాల కారణంగా మండలంలో మంజీర నీటి వల్ల పంటలు ముంపునకు గురై నష్టపోయిన రైతులు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలో ఆందోళన బాట పట్టారు. టీడీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్, రైతు సంఘాల నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఉదయమే తరలి వచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలో కూర్చున్నారు. అనంతరం తహసీల్ కార్యాలయం ఎదుట హైద్రాబాద్-భోధన్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఒడ్డెపల్లి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం సెప్టెంబర్ మాసంలో కురిసిన భారీ వర్షాల కారణంగా మంజీర నది ఉప్పొంగి మండలంలోని 11 గ్రామాలకు చెందిన 2500ల ఎకరాల నిలువు వరి పంటలు నీట మునిగి 1802 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రూ.1.19 కోట్ల పంట నష్టం జరిగినట్లు అధికారులే నిర్ధారించారని ఇప్పటికీ పరిహారం అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం బొల్లు నర్సింహా రెడ్డి, గోపాల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పాల్గొన్నారు.


ధర్నాలో పాల్గొన్న రైతులు, నాయకులు